తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

Published From: Medchal-Malkajgiri | సంపుటి: 5 సంచిక: 97 పేజీలు : 08 | బుధవారం 1-4-2026 వెల: 3 రూ/.

## ఇక మీరు కూడా మా శత్రువులే

### – అమెరికా టెక్ దిగ్గజ కంపెనీలకు ఇరాన్ వార్నింగ్

**టెహ్రాన్** మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) సంచలన హెచ్చరిక జారీ చేసింది. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా, గూగుల్, ఆపిల్ వంటి బడా అమెరికన్ టెక్ కంపెనీలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని బెదిరించింది. ఈ సంస్థలు తమకు చట్టబద్ధమైన లక్ష్యాలని ప్రకటించింది.

2లో..




## ఎన్నికల నియమావళి ఉల్లంఘన

### – టీవీకే అధినేత విజయ్‌పై ఈసీ కేసు

**చెన్నై** ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ ప్రముఖ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్‌పై ఎన్నికల సంఘం కేసు నమోదు చేసింది. ఒక బహిరంగసభలో ఎన్నికల నిబంధనలను అతిక్రమించారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెరవల్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఈకేసు నమోదైంది. బీఎన్ఎస్ 2023, 126(2), బీఎన్ఎస్ సెక్షన్ 189 (2), 223 బీఎన్ఎస్ 3(ఏ) మరియు 3(5) ల కింద పెరవల్లూర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. తమిళనాడులో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీవీకే అధినేత విజయ్ రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటిస్తున్నారు.ఇటీవల ఒక బహిరంగ సభ సందర్భంగా నిబంధనలను ఉల్లంఘించినట్లు ఈసీ ఆరోపించింది. అధికారుల అనుమతి లేకుండా సభలో ఏకంగా

2లో..



## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

### – 4వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

**హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు పంపింది. జనవరి 29వ తేదీన సమ్మక్క సారక్క జాతర దగ్గర జరిగిన గొడవలో కరీంనగర్ కమిషనర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐడీకి అప్పగించడంతో ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్ నగరంలో ఉన్న సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. హుజురాబాద్ పోలీస్ స్టేషన్ కేసు నంబర్ 30/2026 నమోదైంది. సమ్మక్క సారక్క జాతర సమయంలో రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించారనేది కౌశిక్ రెడ్డిపై ఉన్న ఆరోపణ. ప్రజలకు అసౌకర్యం కలిగించారని, పోలీసుల విధులకు అడ్డంకి కలిగించారని, పోలీస్ అధికారులపై అవమానకర

2లో..





## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

### – ఎల్‌డిఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు
### – అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు
### – మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత




**తిరువనంతపురం:** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో

2లో..



## ఏప్రిల్ 2 నుంచి పెద్ద ఎత్తున గ్రామసభలు

### – సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరణ – అభివృద్ధిపై ప్రజలకు అవగాహన
### – డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్,:** ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్దిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు

2లో..

## ట్యాంక్ బండ్ శివకు 5లక్షల ఆర్థిక సాయం

### – అందచేసిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్:**ట్యాంక్ బండ్ శివకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయం అందించారు. కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థికసాయంతో పాటు అతని కుమారుడు వేణుమాధవ్ కు హోం గార్డు ఉద్యోగ నియామకపత్రం అందజేసారు. ట్యాంక్ బండ్ పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివ గురించి ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి చేరింది. ట్యాంక్ బండ్ శివ దీన పరిస్థితిని అర్థం చేసుకున్న సిఎం అతడిని ఆదుకోవడానికి నిర్ణయించారు.ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న ట్యాంక్ బండ్ శివకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ట్యాంక్ బండ్ శివకు అవసరమైన సాయం అందించాలని కొద్ది రోజుల క్రితం అధికారులను ఆదేశించారు. ఉపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ట్యాంక్ బండ్ శివ కోరారున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు.

శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం చేతులమీదుగా సాయం అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ట్యాంక్ బండ్ శివ, కుటుంబసభ్యులు.

2లో..

## బెంగాలీలను బిజెపి అవమానం చేస్తోంది

### – నా ముఖం చూసి మాత్రమే ఓటేయండి
### – సెంటిమెంట్ మాటలతో మమత ప్రచారం



**కోల్‌కతా:** భారతీయ జనతా పార్టీ పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. బీజేపీని 'అనాగరిక' పార్టీగా అభివర్ణించారు. దేశంలోని బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వారిని వేధింపులు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాంకురాలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమతా

2లో..

## కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారు

### – కాంగ్రెస్ పై ప్రధాని మోదీ ఫైర్




**గాంధీ నగర్** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన, భౌగోళిక రాజకీయ సవాళ్లు నెలకొన్నప్పటికీ, భారతదేశం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్-థరాడ్‌లో రూ.19,800 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తూ, కాంగ్రెస్ వదంతులను ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ రాబందుల్లా తయారయ్యారని మండిపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రపంచ ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. "ప్రపంచంలోని ఎన్నో దేశాలు అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. డీజిల్, పెట్రోల్, గ్యాస్ సమస్యలతో సతమతమవుతున్నాయి. అయితే, మన విజయవంతమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యత వల్ల భారత్ ఈ పరిస్థితులను అదుపులో ఉంచగలిగింది" అని ఆయన వివరించారు. చిన్న దేశాల నుంచి అగ్రరాజ్యాల వరకు ఇంధన ధరలు 10 నుంచి 25 శాతం పెరిగాయని, కానీ భారత్ మాత్రం ఆ భారాన్ని ప్రజలపై పడనీయడం లేదని తెలిపారు. ఈ వాస్తవాలను కాంగ్రెస్ చూడలేకపోతోందని మోదీ విమర్శించారు. "దేశానికి ఐక్యత అవసరమైన ఈ సమయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో కాంగ్రెస్ ముందుంది. ధైర్యం చెప్పాల్సిన చోట భయాన్ని, వదంతులను వ్యాపింపజేస్తున్నారు. రాజకీయ రాబందుల్లా దేశంలో గందరగోళం కోసం ఎదురుచూస్తూ, ఎన్నికల లబ్ధి పొందాలని చూస్తున్నారు" అని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇంధన ధరల విషయంలోనూ ప్రజలను క్యూలలో నిలబెట్టి లబ్ధి పొందాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా డీసా ఎయిర్‌బేస్‌ను ప్రారంభించడంపై మోదీ సంతోషం వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌బేస్ అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం

2లో..

## అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

### – కేరళ ప్రచారం కోసం 30ననే అసెంబ్లీ వాయిదా
### – కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికావు
### – మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత హరీష్ రావు



**హైదరాబాద్ :** ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడిపారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని ఒకరోజు.. నాలుగు గంటలు వృధా చేశారన్నారని ఆరోపించారు. మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఒకరోజు పెండ్లి ఉందని పోతరు, ఒకరోజు ÷నాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని అని సభ ఆపేస్తారు. అసలు సభకు వచ్చి ప్రిపేర్ అవుతారా, ప్రిపేర్ అయ్యాక సభకు వస్తారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకరోజు విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇవ్వాలని 4 గంటలు వృథా చేశారని.. మండిపడ్డారు. కేరళ ఎన్నికల కోసం

2లో..

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

### – మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్

2లో..



## మా నీళ్లు దోచుకుంటే ఊరుకోం

### – ఏపీ ప్రభుత్వానికి మంత్రి జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్



**హైదరాబాద్** శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నా ఏపీ ప్రభుత్వం అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. తెలంగాణ నీళ్లు దోచుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇవాళ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మట్లాడిన ఆయన.. ఏపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు సర్కార్ బరితెగించి నీటిని దోచుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే ఏపీ ప్రభుత్వం కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా విద్యుత్ ఉత్పత్తి పేరిట నీటిని తరలించడం అన్యాయమని ఫైరయ్యారు.జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని

2లో..

# ఏప్రిల్ 2 నుంచి గ్రామసభలు పెద్ద ఎత్తున నిర్వహించాలి

- ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జూన్ 2 నుంచి అమలు చేయబోతున్న కొత్త పథకాల గురించి వివరించాలి
-జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు


వీడియో కాన్సరెన్స్ లో మాట్లాడుతున్న కలెక్టర్

**అక్షరగళం, మేడ్చల్ బ్యూరో:** ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి గారి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు.

వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

## ఇక మీరు కూడా మా శత్రువులే

ఇరాన్ ప్రభుత్వ అనుకూల మీడియా సంస్థ తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ ఈ వివరాలను వెల్లడించింది. ఏప్రిల్ 1వ తేదీ రాత్రి 8 గంటల నుంచి ఈ కంపెనీలపై దాడులు ప్రారంభిస్తామని ఐఆర్‌జీసీ స్పష్టం చేసినట్లు పేర్కొంది. మధ్యప్రాచ్యంలోని ఈ కంపెనీల కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది, సమీపంలో నివసించే ప్రజలు వెంటనే ఆ ప్రాంతాలను ఖాళీ చేయాలని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.ఇజ్రాయెల్ జరిపిన దాడులకు, అమెరికా ఇంటెలిజెన్స్ అందించిన మద్దతుకు ప్రతీకారంగానే ఈ హెచ్చరికలు చేసినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ అత్యాధునిక కృత్రిమ మేధస్సు (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి ఇరాన్‌కు చెందిన సుప్రీం లీడర్‌తో సహా 250 మందికి పైగా సీనియర్ అధికారులను హతమార్చిందని, దీనికి ఈ టెక్ కంపెనీలు సహకరించాయని ఐఆర్‌జీసీ ఆరోపిస్తోంది. అందుకే ఈ సంస్థలను 'చట్టబద్ధమైన లక్ష్యాలు'గా పరిగణిస్తున్నామని తన ప్రకటనలో పేర్కొంది. మెటా, గూగుల్, ఆపిల్‌తో పాటు బోయింగ్, టెస్లా వంటి 15కు పైగా కంపెనీలు తమ హిట్ లిస్ట్‌లో ఉన్నాయని ఐఆర్‌జీసీ తెలిపింది. తమ నాయకులపై ఇలాంటి 'టార్గెటెడ్ హత్యలు' కొనసాగితే దాడుల తీవ్రత మరింత పెరుగుతుందని హెచ్చరించింది. కాగా, ఈ నెలలోనే బహ్రెయిన్, యూఏఈలలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై డ్రోన్ దాడులు జరిగినట్లు అమెజాన్ ధృవీకరించడం గమనార్హం.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

వ్యాఖ్యలు చేశాడని కౌశిక్ రెడ్డిపై ఆరోపణలు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించినట్టు కేసు నమోదైంది. ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఏప్రిల్ 4న ఉదయం 11:30కు విచారణకు హాజరు కావాలని పాడి కౌశిక్ రెడ్డికి నోటీసుల్లో స్పష్టం చేశారు. గుర్తింపు పత్రాలు, సంబంధిత డాక్యుమెంట్లు తీసుకురావాలని.. విచారణకు సహకరించాల్సిందిగా కోరారు. సాక్ష్యాలను చెడగొట్టవద్దని హెచ్చరించారు. నోటీసును పట్టించుకోకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఎన్నికల నియమావళి ఉల్లంఘన

30 లౌడ్ స్పీకర్లు ఉపయోగించారని, అలాగే 5,000 మందికి మించి ప్రజలు సభకు హాజరయ్యారని, దీనితో ప్రజలకు అసౌకర్యం కలిగించారని ఆరోపిస్తూ ఈసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, రోడ్లు బ్లాక్ చేయడం, అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడం, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాల్ని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విజయ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. విజయ్‌తోపాటు సభకు హాజరైన పార్టీ కార్యకర్తల్ని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ–లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

## బెంగాలీలను బిజెపి అవమానం చేస్తోంది

బెనర్జీ ప్రసంగించారు. టీఎంసీ అభ్యర్థులు ఎవరనేది కాకుండా తన నాయకత్వాన్ని మాత్రమే చూడాలని ఈ సందర్భంగా ఓటర్లను మమతాబెనర్జీ కోరారు. 294 నియోజకవర్గాల్లోనే తననే అభ్యర్థిగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో అవకతలను ప్రధానంగా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ, ఒకేరోజు 30,000 అప్లికేషన్లు దాఖలైనట్టు పార్టీ నేత అభిషేక్ బెనర్జీ వద్ద సమాచారం ఉందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను బీజేపీ దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. 'బిహార్‌లో చేసినట్టుగానే రైల్వేలను ఉపయోగించుకుని బయట ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది' అని అన్నారు. భారత ఎన్నికల కమిషన్‌పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ చెప్పినట్టు ఈసీఐ నడుచుకుంటోందని, బీజేపీ–ఈసీ కలిసి ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను ఊడలాక్కుంటాయని ఆరోపించారు. ఓటర్ల లిస్ట్‌లో కొందరిని టా÷–గ్గ÷ట్ చేసి తొలగించడం, మరికొందరిని జాబితాలో చేర్చడం జరుగుతోందన్నారు. తప్పుడు ఫారం–6 అప్లికేషన్లతో బీహార్ ఓటర్ల జాబితాలో చేరేందుకు ప్రయత్నించిన పలువురు బీజేపీ కార్యకర్తలు పట్టుబడినట్టు చెప్పారు. ఇది కేవలం ఓటర్ల హైజాకింగ్ కిందకే వస్తుందన్నారు. చట్టబద్ధత కలిగిన 60 లక్షల అప్లికేషన్లు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. బల్క్ ఎంట్రీలను మాత్రం ఫాస్ట్ ట్రాక్ చేస్తున్నారని అన్నారు. ఇదెంతమాత్రం రొటీన్ ప్రక్రియ కాదని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మాంసాహారంపై నిషేధం విధిస్తుందని, దొడ్డిదారిన ఎన్ఆర్‌సీ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సాంస్కృతిక ఆంక్షలు, వివాదాస్పద విధానాలు అవలంబిస్తోందని అన్నారు.

## అమెరికా సాయం చేయదు.. మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

న్యూయార్క్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ పెట్టారు. "ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. "అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి" అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

## కాంగ్రెస్ నేతలు రాజకీయ
# రాబందుల్లా తయారయ్యారు

130 కిలోమీటర్ల దూరంలో ఉంది. దేశ భద్రతకు ఇది చాలా కీలకం" అని ఆయన పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టుకు భూసేకరణ జరిగిందని గుర్తుచేశారు. "అప్పుడు ఢిల్లీలో అధికారంలో ఉన్నవారికి గుజరాత్‌పై ఎందుకో ద్వేషం. ఏళ్ల తరబడి ఫైళ్లను తొక్కిపెట్టి ప్రాజెక్టును అడ్డుకున్నారు.

మీరు నన్ను ఢిల్లీకి పంపిన తర్వాత ఆ ఫైళ్లను బయటకు తీసి, ఈ ఎయిర్‌బేస్‌ను పూర్తి చేశాను" అని మోదీ తెలిపారు. ఈ ఆలస్యానికి కాంగ్రెస్ వైఖరే కారణమని, దేశ భద్రత విషయంలో వారి ప్రవర్తనను జాతి ఎప్పటికీ క్షమించదని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఏఐ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలు భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం దేశ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూశారని మోదీ ఆరోపించారు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడే శక్తుల మాదిరిగా కాంగ్రెస్ మాట్లాడుతోందని విమర్శించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో చూపిన ఐక్యతను ఇప్పుడు కూడా ప్రదర్శించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తర గుజరాత్ అభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, దేశీయ, అంతర్జాతీయ సవాళ్లను భారత్ ఎలా ఎదుర్కొంటుందో చెప్పడానికి నిదర్శనమని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

## తల్లిదండ్రులకు రక్షణ చట్టం తెచ్చి
# ఎంతో సాహసం చేశాం'



**కల్వకుర్తి మార్చి 31 (అక్షర గళం)** తల్లిదండ్రులకు రక్షణ చట్టం తీసుకువచ్చి ఎవరు చేయలేని సాహసం రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతోమంది తల్లిదండ్రులను అనాథ ఆశ్రమాలలో చేర్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి బుద్ధి చెప్పడానికే ప్రభుత్వం ఈ చట్టం తీసుకొచ్చిందని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్ కుమార్ యాదవ్ అశోక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి మున్సిపల్ బడ్జెట్ సమావేశం






కల్వకుర్తి మార్చి 31 (అక్షర గళం) కల్వకుర్తి మునిసిపాలిటీ తొలి బడ్జెట్ సమావేశం మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జరిగిన బడ్జెట్ సమావేశంలో 2026– 2027 అంచనా ఆదాయం సుమారు 51.50 కోట్లతో 2026–27 సంవత్సరానికి బడ్జెట్ వ్యయం సుమారు 51.38 కోట్లతో2026.27 బడ్జెట్ మిగులు సుమారు 0.12 కోట్ల రూపాయలుగా పేర్కొన్నారు.ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనులు, రాబోయే ఏడాదిలో చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, వైస్ చైర్మన్ పర్సన్ కాన్వాస్ ఖాన్, కల్వకుర్తిలో అన్ని వార్డుల కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి

- మండల ప్రత్యేక అధికారి మాధవ్




**యాచారం, అక్షరగళం :** నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి మాధవ్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో పల్లెప్రకృతి వనం, నర్సరీలను ఎంపీవో శ్రీలత, సూపరిండెంట్ శైలజతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... పల్లె ప్రకృతివనం, నర్సరీలను పరిశీలించి అక్కడి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు, ఉపసర్పంచ్ అనేమోని రవీందర్, కార్యదర్శి జి. మహేష్ కుమార్, వార్డు సభ్యులు గోపలి కల్పన మహేందర్, సముద్రాల ప్రవీణ్, మడ్డి సురేష్, జంగిలి రమేష్, సిబ్బంది తదితరులున్నారు.

## మా నీళ్లు దోచుకుంటే ఊరుకోం

మంత్రి గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయారని తాము ధర్నాకు దిగే వరకు ఆ దోపిడీ ఆగలేదని మంత్రి జూపల్లి విమర్శించారు. నాడు ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించగా అక్రమ నీటి తరలింపును ఆపాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే పంథాను అనుసరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.శ్రీశైలం నీటిలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని, దక్షిణ తెలంగాణ రైతాంగం హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'మీరేమైనా చదువురాని వాళ్లా? జీవోలు స్పష్టంగా ఉన్నాక ఇంకా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏముంది?' అంటూ ఏపీ అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంటే ఏపీ ప్రభుత్వం మాత్రం చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తోందని ఫైరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో నీటి దోపిడీని పట్టించుకోకపోవటం వల్లే ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని విమర్శించారు.ఏపీ ప్రభుత్వం తన అక్రమాలను తక్షణమే నిలిపివేయాలని లేదంటే తెలంగాణ ప్రభుత్వం, రైతులు, కాంగ్రెస్ పార్టీ సమిష్టిగా పోరాటం చేస్తామని జూపల్లి హెచ్చరించారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదని ఈ క్రమంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తమ నీటి వాటాను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఏపీ ప్రభుత్వానికి తేల్చి చెప్పారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని లేదంట తీవ్ర పరిణామాలు ఉంటాయని మంత్రి జూపల్లి కృష్ణారావు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

శాసనసభని 30వ తేదీనే బంద్ పెట్టారు. కేరళ ఎన్నికలు మీకు అవసరం ఏమో..? తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి శాసనసభ ముఖ్యం, ప్రజా సమస్యలు ముఖ్యమని హరీష్ రావు స్పష్టం చేశారు. శాసనసభలో పహిల్వాన్లు అని రేవంత్ రెడ్డి అంటాడు, కత్తులతో తలలు తీసేస్తామని ఇంకో సభ్యుడు అంటాడు. మరి ఇవన్నీ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయరా..? కాంగ్రెస్ సర్కార్‌ను హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు అనాగరిక భాష మాట్లాడాడు, మరి అది రిఫర్ చేయరా ఎథిక్స్ కమిటీకి..? అని అడిగారు. మీరు అసెంబ్లీలో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా, ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని హరీష్ రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదని హరీష్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పింది. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టాడు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వచ్చేవే కదా అని అన్నారు. సీఆర్ పాటిల్ ఒకసారి తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను అడిగితే, నీళ్లు ఎప్పుడు వచ్చాయి, ఎలా వచ్చాయని స్పష్టంగా తెలుస్తుందన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క రూ.50 కోట్లు ఇస్తే ఇంకొక 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని, రెండేళ్ల నుండి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తలేడని అన్నారు. మీకు మా మీద కోపం ఉంటే తీర్చుకోండి.. కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపకండని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు.

## ఏప్రిల్ 2 నుంచి పెద్ద ఎత్తున గ్రామసభలు

చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు.

వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ÷–రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

## విజయవాడ మార్క్‌ఫెడ్ వద్ద రైతుల రాస్తారోకో

విజయవాడలోని మార్క్‌ఫెడ్ కార్యాలయం వద్ద రైతులు రాస్తారోకోకు దిగారు. వ్యవసాయ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో రైతులు రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.ప్రదర్శనలో రైతులు పట్టిన బ్యానర్లలో "మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి", "యుద్ధ ప్రాతిపదికన అన్ని పంటల రైతులను ఆదుకోవాలి" వంటి నినాదాలు చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం ఆలస్యమవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నిరసన కారణంగా కొంతసేపు రహదారి రాకపోకలు నిలిచిపోయాయి.రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు

## మాజీ మంత్రి పెద్దిరెడ్డి కాన్వాయ్‌లో
# తప్పిన పెనుప్రమాదం

**మదనపల్లి** మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్ లో పెనుప్రమాదం తప్పింది. మదనపల్లి పట్టణం ఎస్టేట్ లొ గల కరెంటు ఆఫీస్ వద్ద ఘటన జరిగింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్ లో మూడు కారులు ఢీకొన్నాయి.
ఈ ప్రమాదంలో మూడు కారు లు దెబ్బతిన్నాయి. కాన్వాయ్ లో మదనపల్లి నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షులు వైసీపీ మదనపల్లి రూరల్ మండల పార్టీ పరిశీలకులు హర్ష వర్ధన్ రెడ్డి ఫార్చ్యూనర్ వాహనం డ్యామేజ్ అయింది.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్

బుధవారం - 1- ఏప్రిల్ 2026 - పేజీలు


## మాసీవ్ డ్రైవ్ కలెక్షన్ ప్రోగ్రాంలో

# ఒక్కరోజే 56 లక్షల వసూలు



**అక్షరగళం,కుత్బుల్లాపూర్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ గాజులరామారం సర్కిల్ పరిధిలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి ప్రతిరోజు షెడ్యూల్ ప్రకారం 26వ రోజు కార్యక్రమంలో భాగంగా ప్రాపర్టీ ప్రాపర్టీ టాక్స్ మాసివ్ డ్రైవ్ కలెక్షన్ ప్రోగ్రాంలో భాగంగా డిప్యూటీ కమిషనర్ గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ గారు పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా రాజీవ్ గాంధీ నగర్ లో బేకరీని సీజ్ చేయడం జరిగింది, ఉష ముళ్లపూడి హాస్పిటల్ రోడ్ లో కార్ షెడ్ ని సీస్ చేయడం జరిగింది. మాసివ్ డ్రైవ్ లో భాగంగా 277 ప్రాపర్టీస్ అమౌంట్ 56.65 lakhs కలెక్ట్ చేయడం జరిగింది. అందరూ ప్రాపర్టీ ట్యాక్స్ కట్టి అభివృద్ధికి తోడ్పాడాలని డిప్యూటీ కమీషనర్ ప్రజలకు సూచించారు.

## సీ సీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**వెల్దండ మార్చి 31 (అక్షర గళం)** వెల్దండ మండల కేంద్రంలోని 7వ వార్డు ముదిరాజ్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను భూమి పూజ చేసి ప్రారంభించార ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను పంచాయితీ కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు మారేపల్లి మంజుల శ్రీను ముదిగొండ కవిత రమేష్ , పిల్లి దేవేందర్, ఎస్ శేఖర్ జంగిలి ఆనంద్ రేవెల్లి మానస రాజు మాసుల బాలరాజు నాయకులు కొయ్యల పుల్లయ్య ,క్యాసరపు మల్లేష్,ఈదులపల్లి శ్రీనివాస్, బాదేపల్లి రామకృష్ణ,సాదమోని శ్రీనివాస్, అన్నెపు వెంకటయ్య, సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ వెల్దండ మండల అధ్యక్షుడిగా

# పుట్ట రాంరెడ్డి





వెల్దండ మార్చి 31 (అక్షర గళం ) వెల్దండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా పుట్ట రాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ విజితా రెడ్డి ఆధ్వర్యంలో రాంరెడ్డిని అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు వెల్దండ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కమ్మగోని వెంకటయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మొక్తాల శేఖర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రాజు నాయక్, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా మెగావత్ శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా లచ్చిరాం నాయక్, కార్యదర్శిగా చంద్రశేఖర్ సహ 20 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు

## వైద్యం కోసం వచ్చే వారికి మెరుగైన

# సేవలు అందించాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**కల్వకుర్తి మార్చి 31 (అక్షర గళం)** వైద్యం కోసం పేద ప్రజలు ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలో అందించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సలహా సంఘం సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్, మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల, ఆస్పత్రిసూపరింటెండెంట్ డాక్టర్ శివరాం తదితరులు హాజరయ్యారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## టియుడబ్ల్యూజే [హెచ్ 143]కి తిరుగులేదు

# ఎవరు పోటీ రారు

**- రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉప్పర శేఖర్ సాగర్. - నూతన నియోజకవర్గ తెంజు అధ్యక్షుడిగా వరికుప్పల అశోక్. - టీయూడబ్ల్యూజే జనరల్ సెక్రటరీగా మోలుగు శ్రీనివాస్. - పున్నమి న్యూస్ ప్రతినిధి**




**యాచారం, అక్షరగళం :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వైష్ణవి గార్డెన్ లో టీయూడబ్ల్యూజే (హెచ్ 143) ఇబ్రహీంపట్నం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నియోజకవర్గ అధ్యక్షులు సురమోని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, ప్రధాన కార్యదర్శి గాదం రమేష్ లు హాజరయ్యారు. ముందుగా నూతన నియోజకవర్గ తెంజు అధ్యక్షుడిగా వరికుప్పల అశోక్ ను, టీయూడబ్ల్యూజే జనరల్ సెక్రటరీగా మోలుగు శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కూడా అప్పుడున్నటువంటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ అప్పటి 10 జిల్లాలలో రంగారెడ్డి జిల్లాలో ఉన్నటువంటి టియుడబ్ల్యూజే జర్నలిస్టుల పాత్రని నెంబర్ వన్ స్థానం ఉందని, అప్పటి మొదటి ప్రభుత్వం కేసీఆర్ యొక్క ప్రభుత్వం, ప్రభుత్వం పాలకులు కొద్దిసేపు పక్క పెడితే మన హక్కుగా మనం ఒక ట్రేడ్ యూనియన్ విధానంలో మనకు ఉన్నటువంటి పరిధిలో పోరాటం చేసి ఆ ప్రభుత్వం మీద స్నేహపూర్వకమైనటువంటి సంప్రదింపులు కావచ్చు లేదంటే తేడా వచ్చినప్పుడు కేసీఆర్ యొక్క ప్రభుత్వంలో కూడా తెలంగాణ వ్యాప్తంగా జర్నలిస్టులు ఉవ్వెత్తున ఉద్యమానికి రెడీ అవుతున్నమని చెప్పేసి ఒక ఆందోళన కార్యక్రమం తీసుకుంటే 24 గంటలలో హక్కుల సాధన కోసం మన యూనియన్ పోరాటాన్ని ప్రభుత్వం గుర్తించింది. మన యూనియన్ మొదటి నుంచి కూడా పోరాటం కొనసాగిస్తూ వచ్చింది. జర్నలిస్ట్ ల కుటుంబలకు నాణ్యమైన విద్యను, నాణ్యమైన వైద్యాన్ని పొందారు. ఈ విషయం ఇతర యూనియన్ వాళ్లు మననం చేసుకోవాలి అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాకు, ప్రింట్ మీడియాలో కూడా కేటగిరి వయసుగా బిగ్ పేపర్స్ లేదంటే మీడియం స్మాల్ అని విభజన చేసి సర్కులేషన్ ను బట్టి దాని యొక్క విధానాన్ని విధివిధానాలు పర్ఫెక్ట్ గా అప్పుడున్నటువంటి అక్రిడేషన్ కమిటీ చైర్మన్ అల్లం నారాయణ కృషి చేశారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని గాలికి వదిలేసి వాళ్ళ యొక్క పత్రికలకు, వారి యొక్క ఛానల్ లకు రేటింగ్ పెంచుకుంటున్నారు. రాజ్యాంగబద్ధమైనటువంటి హోదాలో బాధ్యత కలిగినటువంటి ఒక నాయకుడు ఒక యూనియన్ నాయకులను చెప్పుకుంటూ తన యూనియన్ నాయకులను పక్కన కూర్చోబెట్టుకుని మీరు స్వప్రయోజనాలకు ఇచ్చేటువంటి ప్రాధాన్యత జర్నలిస్టు నాయకునిగా మీడియాకు చైర్మన్ గా ఈ ప్రభుత్వంలో కీలకమైనటువంటి ఒక క్యాబినెట్ హోదాలో ఉన్నటువంటి నాయకుడిగా మీరు ఏం చేశారో చెప్పండి అన్నారు. అల్లం నారాయణ టియుడబ్ల్యూ యూనియన్ జర్నలిస్టులకు ప్రాధాన్యత వచ్చిందని, జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇవ్వాల్సిందె అని ప్రభుత్వానికి చెప్తే మొట్టమొదటి ప్రభుత్వం 100 కోట్ల రూపాయల బడ్జెట్ ప్రకటన చేసి 42 కోట్ల రూపాయల నిధులను విడుదల చరిత్ర ఈ యూనియన్ ఇది అన్నారు. 250 జీఓకు వ్యతిరేకంగా డిసెంబర్ 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిచ్చి వేలాది మంది జర్నలిస్టులు రోడ్డు మీదకు వచ్చి జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో కలెక్టర్లకు మెమొరండం ఇస్తే తప్పని పరిస్థితుల్లో దిగి వచ్చినటువంటి ప్రభుత్వము ఐ.ఎన్.పి.ఆర్ ఏదైతే అధికారులు సమాచార శాఖ మంత్రి యొక్క ఆదేశానుసారం దిగివచ్చి ఆ జీవోను మళ్లీ మార్పులు చేశారో అందరికీ తెలుసు అన్నారు. టీయూడబ్ల్యూజే (హెచ్ 143) కు తిరుగులేదు, మాకు పోటీ ఎవరూ లేరు, వాళ్ళు మాతో పాటు ఎవడు సాటి రాడు.మెజారిటీ జర్నలిస్టులు ఇబ్రహీంపట్నంలో మన యూనియన్ సభ్యులుగా ఉన్నారు. జర్నలిస్ట్ లకు ఏ ఆపద వచ్చిన అర్ధరాత్రి రెండు గంటలకు సమాచారం అందించిన ఎక్కడ ఆపద ఉన్నది అంటే అక్కడ వాలిపోయేటువంటి నాయకులుగా అందరిలో అందరి సంక్షేమం కోసం మన భవిష్యత్తు కోసం పనిచేయడానికి త్యాగంతో కూడుకున్నటువంటి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులు మాత్రమే వాళ్లకు మాత్రం మన దగ్గర అవకాశం ఉంటుంది అలాంటి ఆలోచనలు వున్నది ఇప్పుడు కూడా ఎవరైనా కూడా వెళ్ళిపోవచ్చు అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బిరుదు చందర్, జిల్లా కోశాధికారి పి.వెంకటేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి పల్లె వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు రాఘవేంద్ర చారి, జిల్లా కార్యవర్గ సభ్యులు దెంది హరికృష్ణ రెడ్డి, చెరుకూరి మహేందర్, చెరుకూరి రాజు, సీనియర్ జర్నలిస్టులు ఆర్ కే.యాదవ్, హనుమంతు సుదర్శన్, సురమోని బాబు, చెరుకూరి మల్లేష్, సంతోష్, సురేష్, వెంకటేష్, రాజు, భూ చక్రం గౌడ్, గోవర్ధన్, మహేష్ చారీ, విజేయ్, గిరి, నరేందర్ రెడ్డి, నరేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన

# పోలీసు అధికారుల సేవలకు సెల్యూట్

**-సైబరాబాద్ సీపీ రమేశ్**



పదవీ విరమణ పొందిన వారితో సీపి రమేశ్

**అక్షరగళం,సిటీ బ్యూరో:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ, రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు.పదవీ విరమణ పొందిన వారిలో ఎస్ఐ కె. యాదయ్య (నందిగామ పోలీస్ స్టేషన్), ఎస్ఐ డి. చంద్రశేఖర్ (బాచుపల్లి పోలీస్ స్టేషన్), ఆర్ఎస్ఐ హెచ్. బాలకిషన్(సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్), ఏఆర్ఎస్ఐ పి. విష్ణు వర్ధన్ రెడ్డి(సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్), ఏఆర్‌హెచ్‌సీ పి. ధర్మరావు (సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు, సహచరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, పోలీసు సేవ అనేది సాధారణ ఉద్యోగం కాకుండా సమాజానికి అంకితభావంతో చేసే బాధ్యత అని తెలిపారు. పదవీ విరమణ పొందుతున్న సిబ్బంది తమ సేవా కాలంలో క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించి శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. ప్రజల భద్రత కోసం వారు చేసిన కృషి, త్యాగాలు ఎప్పటికీ గుర్తుండ పోతాయని పేర్కొన్నారు. అదేవిధంగా, పోలీసు అధికారుల విజయాల వెనుక వారి కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిదని అన్నారు. విధుల్లో ఉన్నప్పుడు కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని అండగా నిలిచిన కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్మెంట్ అనంతరం వారు కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో సుఖశాంతులు కలగాలని శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, అడ్మిన్ ఏడీసీపీ ఎఫ్. రెహ్మాన్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీఏఓ వెంకట్ రెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమకర్, పోలీస్ సహకార సంఘం ఇన్‌చార్జ్ జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలు విజయవంతంగా

# నిర్వహించాలి'



కల్వకుర్తి మార్చి 31 (అక్షర గళం) ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న జరిగే వార్డు, గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, అమరేందర్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు.

# సంపాదకీయం

## కంగారు పెట్టించిన కగార్

ఆపరేషన్ కగార్... మావోయిస్టులను కంగారు పెట్టేసింది. ఉడుకు రక్తంతో చావంటే తెలియని భయం... వయసు మీరిన తర్వాత వారి వెన్నులో వణుకు పుట్టించింది. మావోయిజంపై ఉక్కుపాదం మోపుతామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలతో భయపెట్టింది. ఆ హెచ్చరికలను మావోయిస్టులు లైట్ తీసుకోవడంతో యాక్షన్ ప్లాన్ అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వాన్ని భయపెట్టిన మావోలు.. ఇపుడు వాళ్లనే ప్రభుత్వం భయపడే స్థితికి తీసుకొచ్చింది. ఇంతకీ మన దేశంలో మావోల శకం ముగిసినట్టేనా.. వారికి నూకలు చెల్లినట్టేనా..కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆపరేషన్ కగార్ చేపట్టిన భద్రతా బలగాలు అడవులను జల్లెడపట్టింది. కనిపించిన మావోలను కనిపించనట్టుగా మట్టుబెట్టింది. ఆపరేషన్ కగార్... సత్ఫలితాలనిచ్చింది. మావోయిస్టు ఉద్యమంలో తలపండిన ఉద్దండులు సైతం స్వచ్ఛందలొంగుబాటుకు దారితీసింది. దీంతో ఆ ఉద్యమం కనుమరుగైపోయింది. మావోయిస్టు ఉద్యమం రక్తాక్షరాలతో చరిత్రగా నిలిచిపోయింది. ఒకటే లక్ష్యం... భారత దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని కనుమరుగు చేయాలి. ఉద్యమంలో ఉన్నవారిని జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చి కొత్త జీవితాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. దీంతో తుపాకి వీడండి.. అడవుల్లో అజ్ఞాతం లోంచి జనజీవన స్రవంతిలో కలవండి అనే పిలుపుతో వెనుకాడిన మావోయిస్టులు..ఎన్ కౌంటర్ల తర్వాత స్వచ్ఛంద నిర్ణయంతో మనసు మార్చుకున్నారు. దీంతో మంచి నిర్ణయం తీసుకుని ప్రజాజీవితంలో గడిపేందుకు సమ్మతించారు.మావోయిస్టు ఉద్యమం ఒక చరిత్ర సృష్టించింది. ఇది నిజం. ప్రజా పాలనలో ప్రజా ఉద్యమంగా పురుడుపోసుకున్న మావోయిస్టుల పోరాటం ముగిసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అడవుల్లో అన్నలు... పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రం వాళ్లను మోకాళ్లపై నిలబెట్టిందనే చెప్పాలి. ఈ క్రెడిట్ అంతా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకే దక్కుతుంది. భద్రతా బలగాలకు ఇచ్చిన స్వేచ్ఛతో పాటు పెరిగిన టెక్నాలజీని ఉపయోగించుకొని మావోయిస్టులను అష్ట దిగ్బంధనం చేశారు. మావోయిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, దామోదర్ , గంగన్న లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమం ముగిసిందనే చెప్పాలి. మావోయిస్టు పార్టీ చరిత్రలోనే ఇది అత్యంత కీలక లొంగుబాటుగా చెప్పవచ్చు.. మునుపెన్నడూ లేని రీతిలో ఒకేసారి నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిశారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన పొలిట్‌బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ ఎలియాస్ కుమ్ముదాదా , కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్ , తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ , రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్న డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున.. మిగిలిన ఇద్దరికీ రూ.20 లక్షల చొప్పున పునరావాసం చెక్కుల్ని అందించారు. రెండు నెలలుగా దేశవ్యాప్తంగా మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. మావోయిస్టులు ప్రభావం ఉన్న మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విప్లవాత్మ మార్పులు చోటుచేసుకున్నాయి. మావోయిస్టుల అగ్రనేతలు ఒక్కొక్కరుగా... తమ అనుచరగణంతో పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు.నక్సలైట్లు ఘాతుకానికి బలైన వారిలో అత్యధికులు పోలీసులు కాగా? పోలీసులకు సమాచారం అందించారని ఇన్ ఫార్మర్లపేరుతో అమాయకులను దారుణంగా కాల్చిచంపేశారు మావోలు. ఈ దారుణాలతో ప్రభుత్వాలనే కాదు.. అడవీ ప్రాంత ప్రజానీకాన్ని మావోలు భయపెట్టారు. గ్రామాల్లో ఉన్నవారు భయపడుతూ.. నక్సలైట్లకు ఆశ్రయం కల్పించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్ని సౌకర్యాలను సమకూర్చాలి. సమీప బ్యాంకులను దోపిడీ చేయడం, పారిశ్రామిక వేత్తలను, పెద్ద పెద్ద భూస్వాములను, కాంట్రాక్టర్లను, రాజకీయ నాయకులను బెదిరించి ఆర్థిక వనరులు సమకూర్చుకునేవారు. మాటవినకుండా.. చందాలు ఇవ్వని వారిని ప్రాణాలు తీసే విషయంలో వెనుకాడేవారు కాదు. మావోయిస్టుల మాట వింటేనే జీవితం.. వ్యతిరేకిస్తే మరణమే శాసనంగా అమలుచేశారు. వరుసగా జరిగిన పరిణామాలతో మావోయిస్ట్ అగ్ర నాయకురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క... పొలిట్ బ్యూరో సభ్యులు మల్లోజుల వేణుగోపాల్... కేంద్ర కమిటీ సభ్యులు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న... అగ్ర నాయకులంతా వరుసగా సుమారు 210 మంది మావోయిస్టులు పోలీసులకు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు.

మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తెలంగాణకు చెందినవారే. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఈయన మావోయిస్ట్ ఉద్యమంలో ప్రవేశించి అంచెలంచెలుగా అగ్ర స్థానానికి చేరుకున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పిలుపుతో తుపాకీని పక్కనపెట్టి... అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ప్రజా సమస్యల పరిష్కారంకోసం... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గడగడలాడించిన మావోయిస్టు ఉద్యమం కనుమరుగైపోయింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆంక్షలు... అడవుల్లో గాలింపు చర్యలు... ఆపరేషన్ కగార్ అద్భుత ఫలితాలను ఇచ్చిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇకనుంచి అడవుల్లో తుపాకుల అలజడి వినపడదు. ఎదురు కాల్పులు జరగవు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు హెచ్చరికలుండవు.. అడవుల్లో ఎదురుకాల్పుల్లేని ప్రశాంత వాతావరణం నెలకొల్పాలనుకున్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందనే అభిప్రాయం పోలీసుల్లో వ్యక్తమవుతోంది.

# ప్రాణంతకమైన సైనేట్ వాడకం మానవాళికి పెనుముప్పు

**- మైనింగ్ పరిసర ప్రాంతాలలో గాలి,నీరు,నేల పూర్తిగా కలుషితం. - నీరు,భూమి కలుషితంతో కనుమరుగవుతున్న పండ్ల తోటలు- ఆందోళనలో రైతులు,ప్రజలు.**

**- జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు,పరిశ్రమలు శాఖ మంత్రి టీజీ భరత్ లకు వినతి పత్రం - ఇచ్చిన రాష్ట్ర కార్యదర్శి గీత మాధురి,బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి.**



**తుగ్గలి:**ప్రాణాంతకమైన సైనైట్ వాడకం మానవాళికి పెనుముప్పని,మైనింగ్ కార్యకలాపాల వలన కాలుష్యం పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు,పరిశ్రమలు శాఖ మంత్రి టీజీ భరత్ లకు బిజెపి రాష్ట్ర కార్యదర్శి గీత మాధురి,బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి లు మంగళవారం రోజున వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులతో వారు మాట్లాడుతూ తుగ్గలి మండలంలో జియో మైసూర్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ మైనింగ్ వారు జొన్నగిరి,బొల్లవానిపల్లె,పగిడిరాయి గ్రామాల పరిధిలో బంగారు వెలికి తీయుటకు అక్కడ ఫ్యాక్టరీను ఏర్పాటుచేసి మైనింగ్ పనులను ప్రారంభించారని,ఈ మైనింగ్ పనులలో భాగంగా వెలికితీసిన బంగారం శుద్ధి చేయడానికి ప్రాణాంతకమైన సైనైట్ వంటి రసాయనాలను వాడడం ద్వారా చుట్టూ ఉన్న భూగర్భ జలాలు,గాలి, భూమి కలుషితం అవుతున్నాయని వారు మంత్రులకు తెలియజేశారు. అదేవిధంగా భవిష్యత్తులో అక్కడ గ్రామాలు ఖాళీ చేయవలసిన పరిస్థితి ఉందని,ఇప్పటికే అక్కడి గ్రామాలలో క్యాన్సర్,కిడ్నీ మరియు అంతుచిక్కని వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారని,అక్కడ కనీసం తాగునీటికి శుద్ధి జలం కూడా లేదని వారు మంత్రులకు వివరించారు. అక్కడ ఉన్న పంట భూములు పళ్ళ తోటలు బాగా దెబ్బతిన్నాయని,ప్రజలు వాయు కాలుష్యం వలన అనారోగ్యం పాలవుతున్నారని కావున వెంటనే మైనింగ్ నిర్వహిస్తున్న వారిపైన,ఫ్యాక్టరీ పైన,యాజమాన్యం ఆయన తగు తీసుకోవాలని వారు మంత్రులకు వివరించారు. ముఖ్యంగా మైనింగ్ పరిసర ప్రాంతాలలో ఉన్న పండ్ల తోటలలో భూగర్భ జలాలు కలుషితం అయి అక్కడ ఉన్న చెట్లు చనిపోయాయని,పంటలు కూడా సరిగ్గా పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు తెలియజేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ మంత్రులను కోరారు. ఈ కార్యక్రమం బోయవాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళి నాయుడు,జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ నాగేశ్వరావు, బీజేపీ సాయి,చలపతి,రామకృష్ణ మరియు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ హననం చేస్తున్నారు

**- దాడిశెట్టి రాజా**

**తుని** తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యతిరేకంగా రాజకీయాలు చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని “ఎల్లో మీడియా” ద్వారా వ్యక్తిత్వ హననం చేస్తున్నారని కాకినాడ జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని వైసిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వం నియమించిన గన్మెన్ల విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తూ, తనపై బురద జల్లే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ప్రస్తుతం ఆ గన్మాన్ జిల్లా మంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వద్ద అంగరక్షకుడిగా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. అతనిపై ఏవైనా ఆరోపణలు ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, కానీ రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని దాడిశెట్టి రాజా స్పష్టం చేశారు.

## నెల్లూరులో మంత్రి నాదేండ్ల పర్యటన

**నెల్లూరు** నెల్లూరు జిల్లా సాగు చాలా ప్రత్యేకమైనదని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 40 నుంచి 60 రోజులు ఆలస్యంగా దిగుబడి వచ్చే ప్రాంతమిది అని చెప్పుకొచ్చారు.నెల్లూరులో అధికారులతో కలసి సమీక్షించారు.రైతుల నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని, రైతులను నిలువునా ముంచేశారని ఆయన ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల శ్రమకు అత్యంత గౌరవం అందిస్తోందని, పండించిన ప్రతి ధాన్యం గింజపై వారి పేరు, పండించిన ప్రాంతం తెలిసేలా క్యూఆర్ కోడ్ ముద్రించి భావితరాలకు తెలియజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలల్లో, 400కు పైగా సంక్షేమ వసతి గృహాల్లో రైతులు పండించిన సన్నబియ్యాన్ని పిల్లలకు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## బాణాసంచా పేలుడు ఘటనగ్ర్భాంతి కలిగించింది

**- చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**

**- ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే**



చల్లపల్లి పోలీస్ స్టేషనులో బాణాసంచా పేలుడు ఘటనగ్ర్భాంతి కలిగించిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం చల్లపల్లి పోలీస్ స్టేషనులో దీపావళి టపాసుల పేలుడు ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పేలుడు ధాటికి గురై ధ్వంసమైన ఎస్ఐ కారు, స్టేషన్ భవనం, భీతావహంగా మారిన పరిసరాలు పరిశీలించారు. ఘటనా స్థలంలో పగిలిపోయిన కుండీలు, స్టేషన్ వరండాలో దెబ్బ తిని పలు చోట్ల కాలిపోయిన రిసెప్షన్ కౌంటర్, పగిలిపోయిన ఎస్ఐ గది డోర్, దెబ్బ తిన్న వెనుక గుమ్మం, వరండా పక్క గదిలో ఊడిపోయిన సీలింగ్ పరిశీలించారు. చల్లపల్లి సీఐ కే. ఈశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ పామర్తి గౌతమ్ కుమార్ ఘటన జరిగిన తీరును ఎమ్మెల్యేకు వివరించారు. ప్రమాదంలో గాయపడిన చల్లపల్లి ఎస్ఐ డీ.దుర్గా ఆంజనేయులు, కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్లా, కానిస్టేబుల్ డీ.నాగరాజులకు ఎక్కువ గాయాలు కాగా వారిని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. స్వల్ప గాయాలకు గురైన హెడ్ కానిస్టేబుల్ తేజ, కానిస్టేబుల్ శివపార్వతి చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ దీపావళి టపాసులు కోర్టుకు తరలించే క్రమంలో ప్రమాదవశాత్తు సంభవించిన ఈ ఘటనలో ఎస్ఐ సహా ఐదుగురు పోలీస్ సిబ్బంది గాయాలకు గురికావడం బాధాకరం అన్నారు. వారిలో ఎవరికీ ప్రాణాపాయం వాటిల్లకపోవడం అదృష్టం అన్నారు. పేలుడు ధాటికి భవనంలోని అన్ని గదులు దెబ్బ తిన్నాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రమాద ఘటనలో క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ తేజ, మహిళా కానిస్టేబుల్ శివపార్వతిలను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

## కలుషిత అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి

**హైదరాబాద్** మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టెదాన్ పారిశ్రామిక ప్రాంతంలో కలుషితమైన అల్లం వెల్లుల్లి పేస్టు తయారు చేసి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (ఖైరతాబాద్ జోన్) మరియు హెచ్-ఫాస్ట్ బృందం సంయుక్తంగా అరెస్ట్ చేశాయి. పోలీసులు మైలార్దేవ్పల్లి పి.ఎస్ పరిధిలోని ‘ఎస్కేఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్’ (ప్లాట్ నెం. 25, ఆఇఎఇ, ఐడిఏ కట్టెదాన్) పై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిందితుడైన హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అబిడ్స్ ప్రాంత నివాసిగా గుర్తించారు. అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితులలో ప్లాస్టిక్ డబ్బాల్లో ఈ పేస్టు తయారు చేస్తున్నారు. నాణ్యత లేని ముడి సరుకులు: నాణ్యత లేని అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగించి కలుషితం చేస్తున్నారు. పేస్ట్ తయారీలో ఎసిటిక్ యాసిడ్ మరియు గ్జాంతమ్ గమ్ పౌడర్ వంటి రసాయనాలను కలుపుతున్నట్లు గుర్తించారు. : ఈ కలుషిత పేస్టు బహిరంగ ప్రదేశాల్లో ఉంచడం వల్ల దుమ్ము, ఈగలు వాలినట్లు పోలీసులు గమనించారు. దీనిని హోల్సేల్ కిరాణా దుకాణాలకు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూన్నాడు. : సుమారు 4,032 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, 6,000 కిలోల నాణ్యత లేని వెల్లుల్లి, 210 కిలోల నాణ్యత లేని అల్లం మరియు వెల్లుల్లి పొట్టు, 250 కిలోల ఉప్పు, ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్ మరియు 5 గ్రైండింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

## ప్రతి పల్లెలో స్వేచ్ఛా వాతావరణమే లక్ష్యం

**- సమస్యాత్మక గ్రామాలపై పోలీసుల నిఘా ఎప్పటికీ ఉంటుంది**

**- ఫ్యాక్షన్ గొడవలు లేని గ్రామాలే అభివృద్ధికి నిలయండి**

**- ఎస్పి వెంకట రమణ వెల్లడి**



**కారంపూడి** పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కారంపూడి మండలం లోని మిర్యాల గ్రామంలో కార్డెన్ అండ్ సేర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురజాల డిఎస్పి వెంకటరమణ ఆధ్వర్యంలో తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలలోఈ కార్డెన్ సేర్చ్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని రాష్ట్ర మరియు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డిఎస్పి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడప క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అలాగే ప్రజలు ఎటువంటి ఫ్యాక్షన్ గొడవలు లేని స్వేచ్ఛా జీవితం గడపాలని, అలాంటి గ్రామాలే అభివృద్ధిలో ముందు ఉంటాయని, ఆ దిశగా ఉన్నత అధికారులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలు, ఏసైలు, హెడ్ కానిస్టేబుల్ 8 మంది, కానిస్టేబుల్ తొమ్మిది మంది, హోంగార్డులు 15 మంది పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్, ఆర్ బి కే, విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

**- కడప ఎంపీ అవినాష్ రెడ్డి**



**కడప బ్యూరో (దువ్వూరు)** దువ్వూరు మండలంలోని తెల్లబశాతల గ్రామంలో వాటర్ ప్లాంట్ ఆర్ బి కే విలేజ్ క్లినిక్ ను కడప పార్లమెంట్ సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ నీటిని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఇటువంటి కలతలు లేకుండా కలిసికట్టుగా జీవించాలని ఆయన పేర్కొన్నారు . రాబోయే రోజుల్లో వైయస్సార్ ఆదరించాలని ఆయన ప్రజలు పోరారు . వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు కావలసిన అన్ని రకాలైన సౌకర్యాలతో పాటు ఆర్థికంగా ముందుండేలాగా అన్ని విధాలుగా చేయూతనిచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పేది ఒకటి చేసేది మరొకటిని ఆయన పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ ముత్యాల రామ్ గోవింద్ రెడ్డి గారు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ గారు, మాజీ శాసనసభ్యులు మరియు శిక్షణ కమిటీ చైర్మన్ శ్రీ శెట్టిపల్లి రఘురామిరెడ్డి గారు, వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యనీ వెంకటసుబ్బారెడ్డి గారు, మాజీ వ్యవసాయ శాఖ సలాదారుడు ఇరుగం రెడ్డి తిరుపాల్ రెడ్డి గారు, మాజీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సుమటూరు ప్రసాద్ రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి,దువ్వూరు మాజీ జెడ్పిటిసి బాబు, దువ్వూరు ఎంపీపీ జై చంద్రారెడ్డి, జడ్పిటిసి కృష్ణయ్య, ఏవి సుబ్బారెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, మూలే సుధాకర్ రెడ్డి, షరీఫ్,జూ అమర్ నాథ్ రెడ్డి, మరియు జిల్లా జాయింట్ సెక్రెటరీ గోవిందు రవిశంకర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు

## బాలికతో అసభ్యప్రవర్తన

**- చితకబాదిన స్థానికులు**

**మచిలీపట్నం** మచిలీపట్నంలో మైనర్ (6)బాలిక పై యువకుడి అసభ్య ప్రవర్తనపై కేసు నమోదయింది. నిందితుడు మచిలీపట్నం రాజు పేటకి చెందిన అబ్దుల్ ఖలీల్ గా గుర్తించారు. ఒంటరిగా ఉన్న బాలికల ప్రైవేట్ భాగాలను పట్టుకుని అసభ్య ప్రవర్తన చేసాడని నిర్ధారించారు. మైనర్ పై అసభ్యంగా ప్రవర్తించిన అబ్దుల్ ఖలీల్ ను పట్టుకుని స్థానికులు చితకబాదారు. పోలీసులకు అప్పగించేందుకు స్థానికుల ప్రయత్నం చేసారు. బాధితులు హ్యూమన్ రైట్స్ ప్రతినిధి అమ్మిరెడ్డి రజని ని ఆశ్రయించారు. ఇనకుదురు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

అక్షరగళం
బుధవారం, ఏప్రిల్ 1, 2026

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి

నరసరావుపేట – గుంటూరు ప్రధాన రహదారిపై మంగళవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతులను పల్నాడు జిల్లాలోని గుండాలపాడు గ్రామానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. ప్రమాద ధాటికి బాధితులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఎలా జరిగిందో దర్యాప్తు చేపట్టారు . మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గుండాలపాడు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## పార్లమెంట్ ఎస్టిమేషన్ కమిటీ సభ్యుడుగా ఎన్నికైన...
## ఎం.పీ వైయస్ అవినాష్ రెడ్డిని సన్మానించిన రెడ్యనీ సోదరులు.

**– స్వామి శ్రీ వివేకానంద సూక్తులు పుస్తకాన్ని ఎంపీకి బహూకరించిన రెడ్యనీ.**



**కడప బ్యూరో (దువ్వూరు)** నిరంతర కృషీ వలుదు, ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసే యోధుడు కడప పార్లమెంట్ సభ్యుడు వైయస్ అవినాష్ రెడ్డిని పార్లమెంట్ ఎస్టిమేషన్ కమిటీ సభ్యుడిగా కీలక పదవికి ఎంపిక చేశారు. ఆ మేరకు సోమవారం సాయంత్రం పార్లమెంట్ లో బులిటెన్ విడుదల చేశారు.పార్లమెంటు ద్వారా అభివృద్ధి కోసం చేసే ఖర్చు, వ్యయాల వివరాలను ఎంపీ అవినాష్ పరిశీలిస్తారు.ఆ మేరకు... పార్లమెంట్ ఎస్టిమేషన్ కమిటీ సభ్యుడుగా ఎన్నికైన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని దువ్వూరు మండలం, చల్లబసాయ పల్లెలో మంగళవారం ఉదయం వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యనీ వెంకటసుబ్బారెడ్డి,వైఎస్ఆర్సిపి నేత, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యనీ చంద్ర శేఖర్ రెడ్డి లు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పట్టు కండువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం స్వామి శ్రీ వివేకానంద సూక్తులు పుస్తకాన్ని రెడ్యనీ బహుకరించారు.పుస్తకాన్ని మీరు రోజు 3,4 సూక్తులు చదవాలని రెడ్యనీ కోరగా తప్పక చదువుతానని ఎంపీ అవినాష్ తెలిపారు. ఈ సందర్భంగా రెడ్యనీ మాట్లాడుతూ... ఈ పదవి అవినాష్ కు వన్నె కాదని, అవినాష్ నే పదవికి వన్నె అని, ఈ పదవికి అవినాష్ సంపూర్ణంగా న్యాయం చేస్తారని రెడ్యనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మాజీ శాసనసభ్యుడు, వైఎస్ఆర్సిపి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లి రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ, వైఎస్ఆర్సిపి బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్ యాదవ్ లు పాల్గొన్నారు.

# మాతా శీతలా ఆలయంలో తొక్కిసలట

**– 8 మంది మృతి**

**పాట్నా,** మాతా శీతలా ఆలయంలో తొక్కిసలాట జరిగింది..ఈ ఘటనలో 8 మంది మృతిచెందారు..అందరూ మహిళలే. 12 మందికిపైగా భక్తులు గాయపడ్డారు. బీహార్ షరీఫ్ నుంచి సుమార్ 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాగ్రా గ్రామంలో ఉంది ఆలయం. శీతలాష్టమి కారణంగా భారీగా భక్తులు తరలిరావడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. పూజా కార్యక్రమాల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. మాతా శీతలా ఆలయం చరిత్రస్కంద పురాణం ప్రకారం సతీదేవి శరీరాన్ని మోస్తూ తన కర్తవ్యాన్ని మరిచాడు శివుడు.. ఆ సమయంలో సతీదేవి శరీరాన్ని తన సుదర్శన చక్రంతో ఖండించాడు శ్రీ మహావిష్ణువు. ఈ సమయంలో సతీదేవి శరీర భాగాలు పడిన ప్రదేశాలో శక్తిపీఠాలు. అవశేషాలను శివుడు బీహార్ షరీఫ్ సమీపం పంచానే నది దగ్గర ఖననం చేశాడట. ఆ తర్వాత అక్కడ మహారాజు వృక్షకేతు కలలో కనిపించిన శీతలా మాత ఆ స్థలంలో తవ్వమని ఆదేశించింది. చైత్రమాసం కృష్ణపక్షం సప్తమి రోజు తవ్వగా విగ్రహం బయటపడింది. గుప్తుల కాలంలో చైనా యాత్రికుడు ఫా హియాన్ ఈ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన రచనల్లో ఈ ఆలయం గురించి ప్రస్తావించారు. శీతలామాత జన్మస్థలంగా ఈ ఆలయాన్ని సందర్శిస్తారు భక్తులు. ఈ ఆలయానికి సుమారు 2వేల సంవత్సరాల చరిత్ర ఉందంటారునలంద జిల్లా మాగ్రా గ్రామంలో ఉన్న మా శీతలా ఆలయం బీహార్ లో ప్రముఖ సిద్ధపీఠాల్లో ఒకటి. పార్వతిదేవికి అంకితం చేసిన ఆలయం ఇది. వేడి కారణంగా వచ్చే అనారోగ్యాల నుంచి అమ్మవారు ఉపశమనం కలిగిస్తారని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా చికెన్ పాక్స్ వంటి రోగాలు నయం అవుతాయని నమ్ముతారు. మగధ ప్రాంత నుంచి లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కేవలం రోగాల నివారణే కాదు.. పిల్లల ఆరోగ్యం, సంతానానికి సంబంధించిన సమస్యలు కూడా తొలగిపోతాయని నమ్ముతారు. ఆలయం ప్రాంగణంలో ఉన్న కొలనులో స్నానం ఆచరించ పూజచేయాలనే నియమాన్ని అనుసరిస్తారు. పగటి వేళ దీప ధూపాలు, హోమాలు నిర్వహించరు... సాయంత్రం తర్వాత మాత్రమే దీపధూపాలు, హారతులు ఉంటాయి. ఇక్కడ కొలువైన శీతలామాతా విగ్రహం 12 అడుగుల నల్లరాయితో చెక్కినది..నాలుగు చేతుల్లో సూర్య చంద్రులు, కలశం, శీతలాష్టక గ్రంథం, నీము కొమ్మ ఉంటాయి. అమ్మవారికి నైవేద్యంగా పెరుగు పెడతారు. ఇక్కడ జంతుబలి నిషేధం ఏటా చైత్రమాసంలో నిర్వహించే శీతలాష్టమి రోజు భారీగా భక్తులు తరలివస్తారు. మూడు రోజుల పాటూ జరిగే ఈ ప్రధాన ఉత్సవంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివస్తారు. మూడో రోజు కొత్తగా వండిన వంటలు కాకుండా ముందురోజు చేసిన నైవేద్యాలు సమర్పిస్తారు. శీతలాష్టకం పఠనం, ఆరతి ఉంటుంది. ప్రతి మంగళవారం రద్దీ ఎక్కువగా ఉంటుంది. నవరాత్రి సమయంలోనూ ప్రత్యేక పూజలు చేస్తారు. ఆరోగ్యం, సంతానం, సుఖశాంతులకోసం భక్తులు భారీగా తరలివస్తారు. ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం అని గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు భక్తులు

# బెజవాడ దుర్గమ్మ ఆలయంలో ఇంటి దొంగలు

**విజయవాడ,** ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో అనుమానాస్పద పరిణామాలు చోటుచేసుకున్నాయి. లెక్కింపు సమయంలో వచ్చిన అసలైన బంగారు ఆభరణాలను దారి మళ్లించేందుకు యత్నించారు. కొంతమంది సిబ్బంది రోల్డ్ గోల్డ్ గా చూపిస్తూ పక్కన పెట్టే ప్రయత్నం చేసినట్టు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులకు అనుమానం కలగడంతో వెంటనే పరిశీలన చేపట్టారు. తనిఖీల్లో సుమారు రూ.1.25 లక్షల విలువైన బంగారు వస్తువులు పక్కన పెట్టినట్టు బయటపడింది. దీంతో సంబంధిత సిబ్బందిని అక్కడికక్కడే పట్టుకుని విచారణ ప్రారంభించారు.ఈ ఘటనపై దుర్గగుడి దేవస్థానం ఈవో శీనా నాయక్ తీవ్రంగా స్పందించారు. బాధ్యులైన సిబ్బందికి వెంటనే మెమోలు జారీ చేయడంతో పాటు, పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు ఇచ్చారు. భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలు సహించబోమని స్పష్టం చేశారు. కొత్త ట్రస్ట్ బోర్డు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలాంటి ఘటన వెలుగు చూడటం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఇప్పటికే సీసీ కెమెరాలు, త్రిసభ్య కమిటీ పర్యవేక్షణ ఉన్నప్పటికీ అక్రమాలు కొనసాగుతుండటంపై భక్తులు మండిపడుతున్నారు.దేవుడి దగ్గర కూడా అక్రమాలు అంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హుండీ లెక్కింపులో మరింత పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. భక్తుల విశ్వాసం నిలబెట్టుకోవడం దేవస్థానం ముందున్న పెద్ద సవాల్‌గా మారింది. కఠిన చర్యలు తీసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే, ఈ వివాదం మరింత పెద్దదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ముంచేసిన మార్చ్ మాసం

ఇండియన్ స్టాక్ మార్కెట్లు మార్చి నెలలో మునుపెన్నడూ లేని విధంగా కుప్పకూలాయి. పశ్చిమాసియాలో ముదిరిన యుద్ధ మేఘాలు, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ ఇన్వెస్టర్ల భారీ అమ్మకాలతో మార్కెట్లు కుదేలయ్యాయి. ఈ నెలలో బిఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 9,339 పాయింట్లు అంటే సుమారు 11.48 శాతం పతనమవ్వగా, నిఫ్టీ 50 కూడా దాదాపు 8% పైగానష్టపోయింది. కేవలం మార్చి చివరి రెండు ట్రేడింగ్ సెషన్లలోనే సెన్సెక్స్ 3,325 పాయింట్లకు పైగా పడిపోవడంతో మదుపరుల సంపద సుమారు రూ. 18.60 లక్షల కోట్లు ఆవిరైపోయింది.మార్చి పతనం ఇన్వెస్టర్లకు ఒక మరచిపోలేని ఆర్థిక పాఠం. స్టాక్ మార్కెట్ అంటే కేవలం బటన్ నొక్కితే వచ్చే లాభం కాదు, అది ప్రపంచ పరిణామాలతో ముడిపడి ఉండే అత్యంత సున్నితమైన వేదిక అని రుజువైంది.

# ఒంటిమిట్ట శ్రీశ్రీ కోదండ రామస్వామి ని దర్శించుకున్న డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు



**బద్వేలు** ఒంటిమిట్ట ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ శ్రీ కోదండ రామస్వామి వారిని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి సోమవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్,అరవ శ్రీనివాసుల రెడ్డి,ఆర్య వైశ్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పరిటాల వెంకట సుబ్బయ్య, పాలకొండు రాజశేఖర్ రెడ్డి,పామూరి బాలి రెడ్డి, మాచుపల్లి కృష్ణారెడ్డి అందూరు వెంకట సుబ్బా రెడ్డి,కోటపాటి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి.

**– డీఈఓ కు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ వినతి.**

**బద్వేలు** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 6 వ తేదీ నుండి 15 వ తేదీ వరకు కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్ నందు జరగనున్న పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో తగు వసతులు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా శాఖ విద్యాశాఖాధికారి షేక్ షంషుద్దీన్ కు విజ్ఞప్తి చేసింది. కడపలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో షేక్ షంషుద్దీన్ ను కలిసి యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున మూల్యాంకన కేంద్రంలో చలువ పందిర్లు, కూలర్లు, ఫ్యాన్లు తగినన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మంచినీటి వసతితోపాటు, మజ్జిగను కూడా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. మూల్యాంకన విధులకు 58 సంవత్సరాల వయస్సు పైబడిన ఉపాధ్యాయులను, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిని, వికలాంగులను, గర్భిణీ స్త్రీలను, చంటి బిడ్డల తల్లులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. గత ఏడాది పదవ తరగతి పరీక్షా విధులు నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్స్ గా విధులు నిర్వహించిన వారితోపాటు మూల్యాంకన విధులు నిర్వహించిన వారిలో చాలామంది ఉపాధ్యాయులకు ఇప్పటివరకు రెమ్యూనరేషన్ చెల్లించలేదని తెలిపారు. గత సంవత్సరపు రెమ్యూనరేషన్ అమౌంట్ ను తక్షణం చెల్లించడంతోపాటు, ఈ ఏడాది విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు జాప్యం లేకుండా, సకాలంలో పారితోషికాన్ని చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. యుటిఎఫ్ చేసిన వినతిపై డీఈఓ షేక్ షంషుద్దీన్ మాట్లాడుతూ మూల్యాంకన కేంద్రంలో వసతి సౌకర్యాలను కల్పించడంలో రాజీపడబోమన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. మూల్యాంకన విధుల పారితోషికాన్ని వెంటనే చెల్లించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎస్.ఎజాస్ అహమ్మద్, జి.గోపీనాథ్ పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రం ఉంది కానీ.....

# టీచర్లు లేరు...?

- సమయపాలనలేని....... అంగన్వాడి సెంటర్లు....?
- 9:30 గంటలైనా తెరుచుకొని సెంటర్లు.
- ఐసిడిఎస్ అధికారుల పర్యవేక్షణ లోపం. విధులకు అంగన్వాడి టీచర్లు డుమ్మా.




**సి.బెళగల్** మండలంలో మొత్తం 58 అంగన్వాడి సెంటర్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయి. ఈ 58 అంగన్వాడి సెంటర్లను రెండు సెక్టార్లుగా విభజించి ఐసిడిఎస్ అధికారుల పర్యవేక్షణలో నడపబడుతున్నాయి. ఇందులో సి.బెళగల్ సెక్టార్ కు సంబంధించి 28 అంగన్వాడి సెంటర్లు అలాగే కొత్తకోట సెక్టార్ కు సంబంధించి 30 అంగన్వాడి సెంటర్లు నడపబడుతున్నాయి. గ్రామాలలో నిర్వహించబడుతున్న అంగన్వాడి కేంద్రాల ముఖ్య ఉద్దేశం. పిల్లల ఆరోగ్యం, పోషణ మరియు గర్భిణీ స్త్రీల సంరక్షణ కోసం పనిచేస్తుంది. ఈ అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రజలకు అందించే ముఖ్యమైన సేవలు పోషకాహారం, పిల్లలకు టీకాలు, ప్రీ స్కూల్ విద్యను అందించడం, ఆరోగ్య పరీక్షలు గర్భిణీ మరియు పాలిచ్చే తల్లులకు సహాయం అందించడం. గ్రామీణ ప్రాంతాలలో చిన్నపిల్లల ఆరోగ్యం పోషణ విద్య అభివృద్ధికి కీలకంగా నిలుస్తున్న అంగన్వాడి కేంద్రాలు ప్రజలకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయి...? అంగన్వాడి కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల భవిష్యత్తును బలపేతం లో కీలక పాత్ర పోషిస్తున్నాయా...? అంగన్వాడి సేవలు గ్రామాలలో నిజంగా అందుతున్నాయా....? పిల్లలకు సరైన పోషకాహారం అందకపోతే వారి భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అంగన్వాడి సేవలు మరింతమెరుగుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ సి.బెళగల్ మండలంలోని కొత్తకోట సెక్టర్లో గల అంగన్వాడి కేంద్రాల్లో పనిచేయుచున్న టీచర్లు మాత్రం సమయపాలన లేకుండా తమకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం వేసవిని దృష్టిలో పెట్టుకొని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అంగన్వాడి సెంటర్లు నడపాలి అని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా పల్ దొడ్డి, కొండాపురం, ముడుమాల, ఈ ర్లదిన్నె, సింగవరం, కొత్తకోట గ్రామాలలో అయితే ఈ అంగన్వాడి కేంద్రాల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ గ్రామాలలో ఉదయం 9:30 గంటలైనా అంగన్వాడి కేంద్రాలు తెరచుకోవడం లేదు. ముఖ్యంగా సింగవరం, కొత్తకోట గ్రామాలలో ఆ యాలు ఉన్న టీచర్లు మాత్రం 11 గంటలకు మధ్యలో విధులకు హాజరవుతున్నారు. దీంతో చేసేదేమీ లేక ఆయాలు అన్ని తానై సెంటర్లను ముందుకు నడుపుతున్నారు. దీనంతటికీ ముఖ్య కారణం ఐసిడిఎస్ అధికారుల పర్యవేక్షణ లోపం అని స్పష్టంగా అర్థమవుతుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొన్నిచోట్ల సమయానికి అంగన్వాడి కేంద్రాలు తెరవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిల్లలకు అందాల్సిన పోషక ఆహారం ఆలస్యంగా లేదా అసలు అందకపోవడం జరుగుతుందని గ్రామాలలో స్థానికులు తెలిపారు. అంగన్వాడి కేంద్రం అంటే పిల్లలకు ఆహారం మాత్రమే కాదు వారి మొదటి పాఠశాల కూడా. అంగన్వాడి కేంద్రాలు బలపడితే దేశం బలపడుతుంది పిల్లల కడుపు నిండితే భవిష్యత్తు వెలుగుతుంది ప్రభుత్వం మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది లేకపోతే చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

# మహావీర్ జయంతి శుభాకాంక్షలు

**పోరుమామిళ్ల** బద్వేలు నియోజకవర్గ అదనవసన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి ప్రజలందరికీ మహావీర్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.శాంతి, సహనం, సత్యం మార్గంలో నడిపించిన మహావీరుడి బోధనలు మన జీవితాలకు మార్గదర్శకం. ప్రజలందరూ ఈ మహానీయుడి అడుగుజాడల్లో నడవాలని కోరుకుంటున్నారు. ఎంతో మహోన్నతమైన వ్యక్తి ఆయన మహావీర్ ఆశయాలను నెరవేర్చాలని విశ్వనాథ రెడ్డి గారు ప్రజలందరికీ మార్గదర్శకం చేశారు ఈ కార్యక్రమంలో నల్లేరు విశ్వనాథ రెడ్డి మరియు ముఖ్య వైఎస్ఆర్సిపి నాయకులు ప్రజలు పాల్గొన్నారు

# వర్ర తోకవలస గ్రామంలో దాహం కేకలు

**– కలుషిత నీటిని సేవించి వ్యాధులు బారిన పడుతున్న గిరిజనులు**



**అరకులోయ** వేసవి ప్రారంభం లోనే తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చి ప్రజలు కన్నీటి కష్టాలు కనిపిస్తున్నాయి.అధికారులు నిర్లక్ష్యం కారణంగా గిరిజన గ్రామాల్లో మంచినీటి సమస్య తో గిరిజనులు విలవిలలాడుతున్నారు.మండలంలోని మారుమూల ప్రాంతమైన శిరగం పంచాయతీలో వర్ర తోకవలస గ్రామం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.ప్రతి గ్రామానికి మంచినీటి భద్రత , ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతున్న ఏళ్ల తరబడి తమ గ్రామంలో మంచి నీటి సమస్య వేధిస్తోందని అంటున్నారు.గిరిజన ప్రాంతంలో త్రాగునీరు కల్పన కోసం కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వం చెబుతున్న అవి ప్రకటనలు వరకే పరిమితం అవుతున్నాయని ఆరోపణలు గుప్పిస్తున్నారు.త్రాగు నీరు లేక దాహం కేకలతో నిత్యం అల్లాడుతున్నమని గ్రామస్తులు వాపోతున్నారు.గుక్కెడు నీరు కోసం పొలాలు, ఊట గడ్డల వెంట ఉరుకులు పరుగులు పెడుతున్నారు.కలుషిత నీటి ను సేవించి అనారోగ్య బారిన పడుతున్నామని తమ గోడును వినిపిస్తున్నారు.గతంలో జల్ జీవన్ మిషన్ పథకం మంజూరైంది.ప్రతి ఇంటికి కొళాయి కోసం బోర్ బావి తవ్వి, పనులను మొదలు పెట్టడంతో మంచి నీటి కష్టాలు తీరయని గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.అయితే ఆ సంతోషం ఎక్కువ రోజులు ఉండలేదు గుత్తేదారుడు పనుల్ని అర్థాంతరంగా మధ్యలోనే ఆపివేయడం తో మళ్లీ ఆ గ్రామంలో మంచి నీటి కష్టాలు మొదలయ్యాయి.త్రాగునీరు కోసం ఏర్పాటు చేసిన బోర్ బావి, పైపులకు మట్టి కప్పకుండా, పైన ఉంచాడంతో అలంకార ప్రాయంగా దర్శనం ఇస్తున్నాయి.జల్ జీవన్ మిషన్ పథకం పనులు ఇంకా కొలిక్కి రాకపోవడంతో త్రాగునీరు కష్టాలు తప్పడం లేదు.దీంతో గ్రామస్తులకు మంచినీటి సౌకర్యం అందని ద్రాక్షగా మారింది.పాలకులు, అధికారులకు ఎన్నిసార్లు తమ గోడు ను విన్నా వించిన పట్టించుకుని నాధుడే కరువయ్యారని ఆరోపిస్తున్నారు.తమ గ్రామంలో ఉన్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తోచడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు.ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యమ్నయ చర్యలు చేపట్టకపోవడం పై గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు.వేసవికాలం ప్రారంభంలోనే మంచినీటి ఎద్దడి ఇలా ఉంటే రానున్న రోజుల్లో మరింతగా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు.ఉన్నతాధికారుల పర్యావేక్షణ లేకపోవడం సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవటంతో మంచి నీటి సమస్యలు ఉత్పనమవుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి.ప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వర్ర తోకవలస గ్రామంలో జల్ జీవన్ మిషన్ పనుల్ని త్వరితగతిన పూర్తి చేసి తాగునీరు అందించేల చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఆర్ డబ్ల్యూఎస్ అధికారి కు వివరణ కోరగా,జల్ జీవన్ మిషన్ కు సంబంధించి బిల్లు లు పెండింగ్ ఉండటంతో పనులు జరగడం లేదని తెలిపారు.

## గ్యాస్ సిలిండర్ల అక్రమ విక్రయాలపై
# అధికారులు చర్యలు తీసుకోవాలి



**పత్తికొండ నూర్ :**పత్తికొండలో హోటల్ చిరు వ్యాపారస్తులకు సంబంధించిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల అక్రమ విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి రాజా సాహెబ్ యు కారుమంచి డిమాండ్ చేశారు మంగళవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమం సిపిఐ పట్టణ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి రాజా సాబ్ యు కారుమంచి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ పట్టణంలో ఎల్పిజి గ్యాస్ సిలిండర్లను అక్రమంగా అధిక ధరలకు విక్రయిస్తున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, సిపిఐ ఆధ్వర్యంలో ఈ రోజు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది., ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా కొన్ని వ్యక్తులు గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి, వినియోగదారులకు అధిక ధరలకు అమ్ముతూ ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధమైన అక్రమ కార్యకలాపాల వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి, అక్రమంగా గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెద్ద ఈరన్న నెట్టకంటయ్య ఏఐవైఎఫ్ నాయకులు రమేష్ సురేష్ ప్రజా సంఘాల నాయకులు గుండు బాషా రంగన్న రవికుమార్ రవి అనిల్ మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం

# రెండు కేసుల్లో ముగ్గురు అరెస్టు



**ఏలూరు** చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్లకు, దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను రెండు వేరు వేరు కేసుల్లో ముగ్గురు దొంగలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 18.80 లక్షలు విలువచేసే,154 గ్రాముల బంగారు భరణాలు, 808 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఏలూరు పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వివరాలను వెల్లడించారుఏలూరు జిల్లాలో చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్న బండి గోపాలకృష్ణ, కుక్కల హరి ప్రకాష్ లను చేబ్రోలు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 12.80 లక్షల విలువచేసే 128 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 19వ తేదీన నెల మండలం బాబాయపాలెం గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో కాకర్ల నాగ దుర్గారావు అరెస్ట్ చేశారు నిడమర్రు పోలీసులు. ఈ దొంగ నుంచి 6 లక్షల విలువ చేసే 26 గ్రాముల బంగారం,808 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారని అన్నారు.

# పెను ప్రమాదంగా మారిన అమెరికా సామ్రాజ్యవాద పోకడలు

- యుద్ధంతో సమిదలవుతున్న అమాయకులు
- నరమేదం జరుగుతన్నా మోడి నోరు మెదపరెందుకో
- సహజ వనరులు దోచుకునేందుకు మావోయిస్టులపై దాడులు
- కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నిలుపుకోవాలి
- ప్రజా పోరాటాలే కమ్యూనిస్టు పార్టీకి అజెండా కావాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా



**కొత్తగూడెం:** అమెరికా సామ్రాజ్యవాద యుద్ధ పోకడలు ప్రపంచ శాంతికి పెనుప్రమాదంగా మారుతోందని, ఈ యుద్ధం భారీ ప్రాణ నష్టానికి, ప్రాంతీయ అస్థిరత్వానికి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విచ్చిన్నానికి దారితీసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ సాబీర్ పాషా అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు ఎస్ఆర్ గార్డెన్స్ లో మంగళవారం జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయేల్ దేశాలు ఇరాన్ పై ఏకపక్ష యుద్ధం చేస్తున్నాయని, దీని వల్ల అమయాకులు సమిదలవుతున్నారని, సుమారు 3300 మందిని పొట్టన పెట్టుకున్నారని, పసి పిల్లలను కూడా వదల్లేదని మండిపడ్డారు. ఈ నరమేదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిన అవసం ఉందన్నారు. భారతదేశ నౌకాదళం పై దాడి జరిగినప్పటికీ, దేశంలో యుద్ధం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్రమోడి కనీసం నోరుమెదపక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. విదేశాంగ విధానానికి కట్టుబడ్డ మోడి మానవీయ కోణాన్ని మరిచారని చెప్పారు. అమెరికా ప్రక్కనే ఉన్న క్యూబాపై కూడా కత్తికట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ కారణంగా దేశంలో పరిస్థితులు క్రమంగా మారిపోతున్నాయని, ధరలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలతో పాటు ఇతర నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ అగార్ పేరుతో 3 వేల మంది మావోయిస్టులను ప్రభుత్వం హతమార్చిందని, కేంద్ర పోకడల కారణంగా అనేక మంది లొంగి పోతున్నారని చెప్పారు. చర్చలకు రానివ్వకుండా మారణహోమం సృష్టిస్తూ భయానక వాతావరణాన్ని కల్పించారని చెప్పారు. మావోయిస్టు రహిత భారతాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిన కేంద్రం ఆ దిశగా సత్ఫలితాలు సాధించామంటూ చెప్పుకుంటుందని అన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన ఉన్న సహజ వనరులను దోచుకునేందుకు కేంద్రం మావోయిస్టులను అడవుల నుండి బయటకు పంపుతోందని, అదానీ, అంబానీలకు అక్కడి సంపదను కారు చౌకగా కట్టబెట్టేందుకు బిజిపి చూస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాల పనితీరుపై ప్రశించే వారిని అర్బన్ నక్సలైట్లు అంటూ ముద్రవేసి వేదింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే పెను ప్రమాదం ముంచుకొస్తోందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలుపుకోవాలన్నారు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు, రైతు రుణ మాఫీ తూతూ మంత్రంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థను ప్రభుత్వం నిర్లక్షం చేస్తోందని, కార్మికుల హక్కులను కాలరాస్తూ ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సేవ్ సింగరేణి పేరుతో సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ముట్టడి కార్యక్రమం విజయ వంతమైందని, దీంతో ప్రభుత్వానికి తమ సత్తా ఎంటోచాటామని తెలిపారు. సింగరేణి కార్మికుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల విధానాన్ని అవలంభిస్తోందని తెలిపారు. రాజకీయ సయోధ్యకు తాము కట్టుబడే ఉన్నామని, కానీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసేందుకు వెనుకంజ వేసేదే లేదని స్పష్టం చేశారు. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, జర్నలిస్టుల సమస్యలపై శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తన గళాన్ని అసెంబ్లీలో వినిపిస్తున్నారని, చట్ట సభల్లో మన ప్రాతినిధ్యం పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటిరిగా బరిలోకి దిగి తమ సత్త ఎంటో చాటామని, కమ్యూనిస్టులను తక్కువ చేసి చూసిన, మాట్లాడిన వాళ్ల నోళ్లు ఎల్లబెట్టుకునే ఫలితాలు సమిష్టిగా రాబట్టడ గలిగామన్నారు. రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో ఇదే స్పూర్తిని కొనసాగిద్దామని తెలిపారు. జి వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర రావుతో పాటు కే సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, ఎస్టి సలీం, సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, మువ్వా వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, అడుసుమిల్లి సాయిబాబా, ఎస్ కే ఫహీం దాదా డి శంకర్ బంధం నాగయ్య మండల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## గుంతనాల, బి.శివరామపురం గ్రామలలో
## సి.సి. రోడ్లను ప్రారంభించిన మంత్రి ఫరూక్



**నంద్యాల మార్చి 31 :**నంద్యాల మండలం గుంతనాల, బి.శివరామపురం గ్రామలలో అభివృద్ధి పనులు వేగంగా పుంజుకుంటున్నాయి. గుంతనాల, బి.శివరామపురం గ్రామలలో నూతనంగా నిర్మించిన సి.సి. రోడ్లను మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధియే రాష్ట్ర అభివృద్ధి అని, ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు . గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుంతనాల మరియు బి.శివరామపురం గ్రామలలో నిర్మించిన సి.సి. రోడ్డు వల్ల స్థానికులకు రవాణా ఇబ్బందులు తొలగుతాయని, రాబోయే రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు కులమతాలకు అతీతంగా అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు గారి ఆశయమని, అధికార యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉంటూ పని చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహకరించిన అధికారులు, గ్రామ పెద్దలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గుంతనాల సర్పంచ్ ఎం. నాగలక్ష్మి, గుంతనాల గ్రామ టిడిపి ఇంచార్జి నాగేశ్వరరావు, మిట్నాల ఎంపీటీసీ చిలుకూరి సుజాత, కేసీ కెనాల్ నీటి సంఘాల అధ్యక్షులు చిలుకూరి రవిబాబు, టిడిపి నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, గుంతనాల ఆనందరావు, ప్రదీప్ రెడ్డి, మిద్దె హుస్సేన్, ఎంపీడీవో, ఎమ్మార్వో, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు స్థానిక టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**అరకులోయ** అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం మండల నూతన కార్యవర్గం ఎన్నికలు అరకులోయ మండల కేంద్రం లోని గిరిజన ఉద్యోగుల భవనంలో మంగళవారం జిల్లా అధ్యక్షులు మసాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నిక అధికారిగా కిల్లు రామ్మూర్తి నాయుడు వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అరకులోయ గిరిజన ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు గా పెట్టెలి ఆనందరావు ,ప్రధాన కార్యదర్శి గా డి.త్రినాథ రావు ను ఉద్యోగ సంఘం నాయకులు ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో ఏకగ్రీవం గా ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు అభినందించారు. గిరిజన ఉద్యోగ సంఘం మండల అధ్యక్షుడు పెట్టేలి ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శి బి.త్రినాధ్ రావు మాట్లాడుతూ మమ్మల్ని నమ్మి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గా ఏకగ్రీవం గా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వారి హక్కుల పరిరక్షణకు , సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. మండల కమిటీ సభ్యులను సమన్వయం చేస్తూ సంఘ కార్యకలాపాలను పటిష్టం చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ లో జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా ఆర్గనైజియింగ్ సెక్రటరీ మఠం వెంకటరమణ,కోశాధికారి వలసనైని కొండలరావు, జిల్లా ఉపాధ్యక్షులు నందోలి మహేష్, జిల్లా జాయింట్ కార్యదర్శి జన్ని సింహాచలం ,జిల్లా ఉపాధ్యక్షులు పాంగి నందో ఏపీటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధనుర్జాయ్ ఎన్ టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పౌల్ యటీఎఫ్ నాయకులు చిట్టిబాబు తదితర ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లాలో పరిశ్రమలకు ఊతం

- రూ.97 లక్షల రాయితీలకు ఆమోదం
- 12 పరిశ్రమల యూనిట్లకు ఆర్థిక ప్రోత్సాహం




**నంద్యాల,** ఉత్పాదన, సేవా రంగాల్లో 12 యూనిట్లకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి)సమావేశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, డి ఆర్ డి ఏ పి డి శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 868 దరఖాస్తులు అందగా, సింగిల్ డెస్క్ విధానం ద్వారా 846 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 22 దరఖాస్తులను సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహంలో భాగంగా ప్రభుత్వ పథకాల ద్వారా పెట్టుబడి రాయితీలు, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీలపై సబ్సిడీలు, సేల్స్ ట్యాక్స్ రాయితీలు వంటి ప్రయోజనాల కింద ఉత్పాదన మరియు సేవా రంగాలకు చెందిన 12 పరిశ్రమల యూనిట్లకు మొత్తం రూ.97.08 లక్షల రాయితీలను కమిటీ ఆమోదించినట్లు తెలిపారు. జిల్లాలో నూతనంగా ఆమోదం పొందిన 19 ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర అవగాహన కలిగి, భూసంబంధిత సమస్యలు, నీటి వనరులకు సంబంధించిన అడ్డంకులు వంటి అంశాలను విశ్లేషించి, తగిన పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఎన్ ఈ డి సి ఏ పి తో సమన్వయం చేసుకుంటూ ప్రతి ప్రాజెక్టులో ఎదురవుతున్న సమస్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే జాయింట్ కలెక్టర్‌కు సమాచారం చేరే విధంగా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల మేనేజర్‌కు సూచించారు. జిల్లాలోని 44 విభాగాల్లో 12 విభాగాల పనితీరు నిరుత్సాహకరంగా ఉన్న నేపథ్యంలో, వాటి పనితీరును మెరుగుపర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద ఈ ఆర్థిక సంవత్సరానికి 260 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు కేవలం 90 మందికి మాత్రమే శిక్షణ పూర్తయినట్లు వెల్లడైందని, లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం విశ్వకర్మ పథకం అమలుపై కూడా సమీక్ష నిర్వహించారు. శిక్షణ కేంద్రాల పనితీరు, లబ్ధిదారులకు అందాల్సిన టూల్ కిట్లు, రుణాల మంజూరు తదితర అంశాలపై వివరాలు ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు 3,662 మందికి శిక్షణ పూర్తవగా, సుమారు 7,000 మందికి పైగా అభ్యర్థులు ఆమోదం పొందినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కోబ్లర్ (చెప్పులు కుట్టే వారు), గోల్డ్‌స్మిత్ (బంగారు పనివారు) విభాగాలకు మాత్రమే రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గతంలో పనిచేసిన 9 ప్రైవేట్ శిక్షణ కేంద్రాలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా బ్యాంకుల ద్వారా మంజూరైన రుణాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమగ్ర నివేదికను 3 రోజుల్లో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం ఎంఎస్‌ఎంఈల సంఖ్య, మండల వారీగా ఎంఎస్‌ఎంఈలు, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ల వివరాలు, ఆన్‌లైన్ రిపోర్టులు మరియు పెండింగ్ స్థితిగతులపై పూర్తి సమాచారం వెంటనే సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

## దేవనకొండ మండలాన్ని
## కరువు మండలంగా ప్రకటించాలి
### - సిపిఎం



**దేవనకొండ** గత ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాలు నేపథ్యంలో భారీగా నష్టపోయిన మండల రైతాంగాన్ని ఆదుకునేందుకు మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలని సిపిఎం జిల్లా నాయకులు బి వీర శేఖర్ డిమాండ్ చేశారు మంగళవారం నాడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ కు దేవనకొండ మండలంను కరువు మండలం గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు యూసుఫ్ భాష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీరశేఖర్ మాట్లాడుతూ గత వ్యవసాయ సీజన్ లో ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ నందు ఆగస్టు మాసం నుండి అక్టోబర్ నెల వరకు అతివృష్టి నేపథ్యంలో ఖరీఫ్ సీజన్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు ఎకరాకు 8 నుండి 10 కింటాలు రావలసిన పత్తి మూడు నాలుగు క్వింటాలకే పరిమితమైందని అదేవిధంగా ఇతర వాణిజ్య పంటలు, వేరుశనగ, కంది ,ఆముదము జొన్న, మొక్కజొన్న వంటి పంటల దిగుబడి భారీగా పడిపోయిందని పెట్టుబడులు మాత్రం వేలకు వేలు పెట్టి దిగుబడి లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని కావున ప్రభుత్వం స్పందించి మండలాన్ని కరువు మండలం గా ప్రకటించి రైతుకు పంట నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువకు నుండి సాగునీరు వస్తున్న పంట కాలువలు లేని నేపథ్యంలో రైతులందరికీ సాగునీరు రావడంలేదని ఇది ప్రభుత్వం గమనించాలని ఆయన కోరారు వాస్తవ పరిస్థితుల్లో గమనించి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మరియు ప్రజా సంఘాల నాయకులు కౌలుట్ల, మార్కండేయులు , జయ రాముడు, చిన్న కౌలుట్లయ్య, రామాంజనేయులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు....

## ఆటోనగర్‌లో బోర్ల పరిశీలన కాలుష్యంపై అధికారుల దృష్టి

ఎన్‌టీఆర్ జిల్లాజగ్గయ్యపేట మండలం ఆటోనగర్‌లో భూగర్భ జలాల కాలుష్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో జిల్లా అధికార బృందం పలు బోర్లను పరిశీలించి నీటి నమూనాలను సేకరించింది. ఆటోనగర్ పరిసరాల్లో ఉన్న కెమికల్ కర్మాగారాల నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా భూగర్భ జలాలు పాడవుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కర్మాగారాల శాఖ, రెవెన్యూ, లేబర్ డిపార్ట్మెంట్, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలుష్య నివారణ కోసం పోరాడుతున్న జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ, కెమికల్ కర్మాగారాల కాలుష్యం కారణంగా ఏపీఐఐసీలోని చిన్న పరిశ్రమలు తీవ్రంగా నష్టపోయి పనులు కోల్పోయామని వాపోయారు. దీంతో ఏపీఐఐసీకి చెల్లించాల్సిన పన్నులు కూడా చెల్లించలేకపోతున్నామని తెలిపారు. అలాగే, కెమికల్ కర్మాగారాల ప్రభావం శాంతినగర్ వరకు విస్తరించి బోరు బావులు పాడవుతున్నాయని, అక్కడ కూడా పరిశీలనలు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజినల్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇప్పటికే కాలుష్యానికి కారణమైన రెండు కర్మాగారాలను మూసివేశామని తెలిపారు. మరిన్ని కాలుష్య కారక సంస్థలపై కూడా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కార్యకర్త కుటుంబానికి మంత్రి లోకేష్ అండ

- గతేడాది కర్నూలు వద్ద విద్యుత్ షాక్ తగిలి అర్జున్ మృతి - టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జున్ కుటుంబాన్ని కలిసిన మంత్రి లోకేష్
- ధైర్యంగా ఉండాలని, జీవితాంతం అండగా ఉంటానని భరోసా

మంగళగిరి: తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ఎప్పుడు, ఏ ఆపద వచ్చినా అండగా నిలిచే మంత్రి నారా లోకేష్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. గతేడాది కర్నూలు జిల్లా నన్నూరు వద్ద విద్యుత్ షాక్ తగిలి మునగాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎమ్.అర్జున్ అనే యువకుడు మృతిచెందాడు. ఈ నేపథ్యంలో అర్జున్ కుటుంబ సభ్యులను మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి మంత్రి పిలిపించారు. దివంగత అర్జున్ తల్లిదండ్రులు మస్తిక్ మద్దిలేటి, రాణితో పాటు సోదరి కోమలితో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అర్జున్ మరణం బాధించిందని చెప్పారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అర్జున్ సోదరి కోమలి చదువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, జీవితాంతం అండగా ఉంటానని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. తమ కుటుంబానికి అండగా నిలవడం పట్ల మంత్రి నారా లోకేష్ కు అర్జున్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## పదవి విరమణ చేసిన పోలీసు
## అధికారులకు వీడ్కోలు కార్యక్రమం



**సిద్దిపేట** సిద్దిపేట్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘంగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులు. సింగీతం శంకర్ రావు, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బెజ్జంకి పోలీస్ స్టేషన్ , ఉద్యోగ ప్రస్థానం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది పనిచేయడం జరిగింది. చాడ శ్రీనివాస్ సిద్ధిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్,ఉద్యోగ ప్రస్థానం కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వరకు అంచలంచలుగా పదవోన్నతి పొంది పనిచేయడం జరిగింది. పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, అభినందించి, సన్మాన పత్రం మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో సుదీర్ఘంగా సర్వస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేయడం జరుగుతుంది. ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేశారు. సిద్ధిపేట పోలీస్ విభాగంలో సుధీర్ఘకాంగా విధులు నిర్వహించి పదవీవిరమణ చేసిన సిబ్బంది సేవను మరువమని, పదవీవిరమణ చేసిన మీరు పోలీస్ కుటుంబంలో ఎలాంటి సమస్య వచ్చిన సిపి సంప్రదించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్షరగళం



## రొయ్యూరు గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

- మన ఊరు మన బాధ్యత
- నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత అవసరం ఏటూరునాగారం ఎస్సై మహేష్



**ఏటూరునాగారం** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు గ్రామపంచాయతీలో మంగళవారం గ్రామ సర్పంచ్ కావిరి అర్జున్ అధ్యక్షతన "మన ఊరు మన బాధ్యత" 99రోజుల గ్రామ ప్రణాళిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో యువత, గ్రామ ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంనికి స్థానిక ఎస్సై మహేష్ హాజరై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రొయ్యూర్ గ్రామాన్ని మద్యపాన రహిత గ్రామంగా తీర్చిదిద్దుతూ, ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అత్యంత అవసరమని ఎస్ఐ పేర్కొన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసుల పని చేస్తుందని, నేరస్తులను గుర్తించడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. రొయ్యూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కావిరి అర్జున్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని, అన్ని రంగాల్లో రొయ్యూర్ ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- మహిళలకు ఆర్థిక భరోసా మహాలక్ష్మి పథకం
- ఉచిత బస్సు ప్రయాణం వెలకట్టలేనిది
- మహిళా సంఘాలే అసలైన శక్తికి నిదర్శనం
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




**ములుగు మార్చి31 :** ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఉత్సవాలు 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా 29.03.2026 నాటికి 290 కోట్ల ప్రయాణాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ములుగు జిల్లాలో ఇప్పటి వరకు 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు ఈ పథకం ద్వారా కూలీ పనులు చేసుకునే వారు, మధ్యతరగతి మహిళలు మరియు ఉద్యోగినులు ఎంతో లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు."గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న బిడ్డలను చూడాలంటే ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించేవాళ్లమని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నామని" ఒక లబ్ధి పొందిన మహిళ తనతో సంతోషాన్ని పంచుకుందని గుర్తు చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు.గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని, దీనివల్ల వేల కోట్ల రూపాయల ఆదా చేసుకోగలిగారని హర్షం వ్యక్తం చేశారు.మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో "ఇందిరా మహిళా శక్తి" పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

## హుజూర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**హుజూర్నగర్ :**నూతన పాలకవర్గం హుజుర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 - 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం హుజుర్ నగర్ మున్సిపాలిటీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి, సత్ఫలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు. హుజుర్నగర్ మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పరిశ్యుద్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఆర్డిఓ కు సూచించారు వార్డులలోని ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళ భద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారుపట్టణాన్ని పరిశుభ్రంగా మరియు అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు.



**నిర్మల్:** బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు. ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు. ఆ తర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి బాసర పర్యటన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మత్తు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి పెద్దపీట

## - రూ. 158 కోట్లతో ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలు

**ఆదిలాబాద్** పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన నిర్వహించారు.ఈ సమావేశంలో రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై సుదీర్ఘంగా చర్చించి, మొత్తం రూ. 157.97 కోట్లతో (సుమారు రూ. 158 కోట్లు) అంచనా ఆదాయ వ్యయాలకు కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు.ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పురోభివృద్ధిలో బడ్జెట్ అత్యంత కీలకమని, గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నామో సమీక్షించుకుంటూ, కొత్త సంవత్సరానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, అనవసర ఖర్చులను తగ్గించుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అమృత్ పథకం కాలపరిమితిని మరో ఏడాది పొడిగించినట్లు, దీని ద్వారా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, మంచినీటి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికుల జీతాలు, వాహనాల నిర్వహణ కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించినట్లు వివరించారు. గ్రీన్ బడ్జెట్ కింద మున్సిపల్ చట్టం ప్రకారం 10% నిధులను పచ్చదనం పెంచడానికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ గ్రాంట్లు, మున్సిపల్ సొంత ఆదాయం మధ్య సమతుల్యత పాటిస్తూ పారదర్శకమైన బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిల్ సభ్యులు బడ్జెట్ అంశాలపై చర్చించి, వార్డుల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక అమలులో వార్డు కౌన్సిలర్లు చురుకైన పాత్ర పోషించాలని, జిల్లా యంత్రాంగం తరపున మున్సిపాలిటీకి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, వార్డుల వారీగా వెనుకబడిన ప్రాంతాలు, విలీన గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. కొత్తగా విలీనమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు స్మశాన వాటికల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వనున్నామని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయ వనరులైన ఆస్తి పన్ను, నల్లా పన్ను ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజు, వైస్ చైర్మన్ రోహిత్, వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్‌కు గుడ్‌బై?

- కాంగ్రెస్‌లో చేరికలు



**భైంసా:** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పోట్పెల్లి గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ బోర్రోళ్ల చరణ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ విరి తమ అనుచరులతో కలిసి పార్టీని వీడుతూ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చేరిన నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నిరుపేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గృహ నిర్మాణం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజురా సర్పంచ్ ముత్తా గౌడ్, మన్మధ్ సర్పంచ్ లలిత భోజన్న, మాజీ జిల్లా వైస్ చైర్మన్ రాజన్న, మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ గీతాభవాని సాయిప్రసాద్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లుట్లలో మధ్యాహ్న భోజన పథకంను తనిఖీ చేసిన ఎమ్మెల్యే యరపతినేని



**మాచవరం** :మాచవరం మండలం, పిల్లుట్ల గ్రామం నందు గుర్రం వీర గోపాల కృష్ణారెడ్ల ప్రభుత్వ పాఠశాల నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల ప్రాంగణంను తరగతి గదులను పరిశీలించి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు వడ్డించే భోజనం ప్రతీ రోజూ మెనూ ప్రకారం సుచిగా రుచిగా పెడుతున్నార లేదా అని యరపతినేని విద్యార్థుల అభిప్రాయం ను అడిగి తెలుసుకున్నారు.

# మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' పథకం భరోసా

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, మార్చి** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా చేపట్టిన 'మహాలక్ష్మి' పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి, సాధికారతకు పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలలో భాగంగా మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ఒక విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ఈ పథకం ప్రారంభం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా వారు సుమారు 10,000 కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ పథకం కింద సుమారు 2.55 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నరని, ఛార్జీల రూపంలో ఆదిలాబాద్ డిపో 106 కోట్లు, ఉట్నూరు డిపో 28 కోట్ల రూపాయలకు పైగా ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, త్వరలోనే ప్రతి ఎస్.హెచ్.జి మహిళకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని ప్రకటించారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, పి.హెచ్.సి కేంద్రాల ద్వారా ఈ పైలట్ ప్రాజెక్టును మొదలుపెడతామని తెలిపారు. అలాగే, మహిళలు బస్సుల్లో ప్రయాణించడమే కాకుండా, స్వయంగా బస్సులను నడిపేలా జిల్లా సమాఖ్యకు ఆర్టీసీ బస్సులను కేటాయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు. పథకం ద్వారా ఆదా అయిన సొమ్మును మహిళలు తమ కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.అనంతరం మహిళ, ట్రాన్స్ జెండర్ ప్రయాణికులను, ఉద్యోగులను కలెక్టర్ శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మెప్మా పిడి రాజు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డిఏం ప్రతిమ, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్టీసీ, ఇతర శాఖల మహిళ ఉద్యోగులు, మహిళా ప్రయాణికులు, ట్రాన్స్ జెండర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్షరగళం



## ఓటీటీలోకి అడుగుపెడుతున్న

# 75 కోట్ల సినిమా!




ఓటీటీలోకి అడుగుపెట్టడానికి ఒక తమిళ సినిమా రెడీ అవుతోంది. ఆ సినిమా పేరే 'తాయి కిళవి'. రాధిక ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా నిర్మాతలలో శివ కార్తికేయన్ ఒకరుగా వ్యవహరించడం విశేషం. ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, తొలి రోజునే సక్సెస్ టాక్ ను సొంతం చేసుకుంటూ దూసుకెళ్లింది. 10 కోట్ల బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమా, 75 కోట్ల వరకూ రాబట్టింది. లుక్ పరంగా .. నటన పరంగా రాధిక మంచి మార్కులు కొట్టేసిన ఈ సినిమాలో, మునీశ్ కాంత్ .. సింగం పులి .. అరుళ్ దాస్ .. బాలశరవణన్ ముఖ్యమైన పాత్రలను పోషించారు. అలాంటి ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను 'జియో హాట్ స్టార్' వారు సొంతం చేసుకున్నారు. ఏప్రిల్ 10వ తేదీ నుంచి తమిళంతో పాటు వివిధ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నట్టుగా ప్రకటించారు. కథలోకి వెళితే రాధిక పాత్ర పేరు 'పవనుత్తాయి'. 70 ఏళ్ల వయసున్న ఆమె వడ్డీ వ్యాపారం చేస్తూ ఆస్తిపాస్తులను బాగానే వెనకేస్తుంది. ఆమె అంటే ముగ్గురు కొడుకులకు .. కోడళ్లకు హడల్. అందరినీ భయపెడుతూ బ్రతికేస్తూ వచ్చిన ఆమె, పక్షవాతంతో మంచాన పడుతుంది. మాటపడిపోయిన ఆమె సైగలతో రోజులు నెట్టుకొస్తూ ఉంటుంది. సంపాదించిందంతా ఆమె బంగారంగా మార్చేసి దాచి ఉంచిందని భావించిన కుటుంబ సభ్యులు ఏం చేస్తారు? అనేది కథ.



## వంశీ పైడిపల్లి సినిమాలో

# సల్మాన్ సరసన నయన్..

**- అధికారిక ప్రకటన**

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంపై ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఖరారు చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌వీసీ) బ్యానర్‌పై అగ్ర నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది వారి 63వ చిత్రం (ఎస్‌వీసీ63). ఈ ప్రాజెక్ట్‌లోకి నయనతారకు స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నామని, 'ది క్వీన్' అడుగుపెట్టిందని నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఇప్పటికే నయనతార బాలీవుడ్‌లో షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' చిత్రంలో నటించి భారీ బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఆ సినిమాతో ఉత్తరాది ప్రేక్షకులను సైతం మెప్పించిన ఆమె, ఇప్పుడు మరో అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో జతకట్టడం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలుగు దర్శకుడు, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ కలిసి చేస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## అందుకే వారిని పట్టించుకోవడం

# మానేశా: నిహారిక



మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నిహారిక తనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా సమాధానమిచ్చారు. నిర్మాతగా కెరీర్ ప్రారంభించినప్పటి నుండి తనపై ఎన్నో విమర్శలు వస్తున్నాయని నిహారిక ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఏం చేసినా తప్పు పట్టేవాళ్లు ఉంటూనే ఉంటారు. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో 11 మంది కొత్తవాళ్లను పరిచయం చేసినప్పుడు.. ఎందుకు ఇదంతా? తెలిసిన వాళ్లతో సినిమాలు చేయొచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' వంటి హై-వోల్టేజ్ వీఎఫ్ఎక్స్ సినిమా చేస్తుంటే... మళ్లీ చిన్న కథలే చేయొచ్చు కదా అని సలహాలు ఇస్తున్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉంటారు, అందుకే వారిని పట్టించుకోవడం మానేశాను" అని ఆమె తెలిపారు. నిర్మాతగా ప్రతి సినిమా తనకు ఒక పాఠమని, నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని నిహారిక తెలిపారు. "నాకు కొణిదెల కుటుంబం ఎంత ముఖ్యమో, నా 'పింక్ ఎలిఫెంట్' టీమ్ కూడా అంతే ముఖ్యం. నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను" అని ధీమా వ్యక్తం చేశారు.

## ఓటీటీలో దూసుకుపోతున్న

# కన్నడ మూవీ!



ఇటీటీలో ఇప్పుడు ఒక కన్నడ మూవీ దూసుకుపోతోంది .. ఆ సినిమా పేరే 'ల్యాండ్ లార్డ్'. జదేశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో,దునియా విజయ్ .. రచితా రామ్ .. రాజ్ బి శెట్టి ప్రధానమైన పాత్రలను పోషించారు. సూరజ్ గౌడ నిర్మించిన ఈ సినిమాను జనవరి 23వ తేదీన విడుదల చేశారు. 12 కోట్లకి పైగా బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, 7 కోట్లకి మించి వసూళ్లను రాబట్టలేకపోయింది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో అందుబాటులో ఉంది. 'ల్యాండ్ లార్డ్' సినిమాకి సంబంధించిన స్ట్రీమింగ్ హక్కులను 'జీ 5' వారు దక్కించుకున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేస్తున్నారు. అయితే తెలుగు ఆడియో అందుబాటులో లేదు. దునియా విజయ్ కూతురు 'రితన్య' ఈ సినిమాలో ఒక కీలకమైన పాత్రను పోషించింది. అజనీశ్ లోక్ నాథ్ అందించిన సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన ఆకర్షణగా నిలిచిందనే ఒక టాక్ బలంగానే వినిపించింది. థియేటర్ల వైపు నుంచి ఓ మాదిరి మార్కులను రాబట్టుకున్న ఈ సినిమా, ఓటీటీలో దూసుకుపోతోందని అంటున్నారు. 1980లలో నడిచే కథ ఇది. రాచయ్య ఓ సాధారణ రైతు .. అతని భార్యనే లింగమ్మ .. వారి కూతురే భాగ్య. ఆ గ్రామానికి చెందిన భూస్వామిగా రాజ్ బి శెట్టి ఉంటాడు. అతను పరమ దుర్మార్గుడు. ఇటు రాజకీయ నాయకులను .. అటు పోలీస్ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని ఒక ఆటాడిస్తూ ఉంటాడు. రైతు కూలీలను అణచివేస్తున్న భూస్వామి పట్ల రాచయ్య ఎలా స్పందిస్తాడు? ఆ ఫలితాన్ని ఆయన కుటుంబం ఎలా ఫేస్ చేస్తుంది? అనేది కథ.

# వరుస సినిమాలో ప్రభాస్ బిజీ



ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బ్జడెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు 'కల్కి 2' షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా 'సలార్', 'కల్కి 2898', 'ఆదిపురుష్' వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా

## యూట్యూబ్‌లో లీకైన 'ధురంధర్ 2'..

## అభిమానుల ఫిర్యాదుతో లింక్ డిలీట్!



బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ధురంధర్ 2' (ధురంధర్: ది రివెంజ్) పైరసీ ఉచ్చులో చిక్కుకుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో దూసుకుపోతున్న ఈ చిత్రం.. తాజాగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్‌లో లీక్ కావడం కలకలం రేపుతుంది. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా నడుస్తున్న ఈ సినిమా పూర్తి నిడివి గల పైరేటెడ్ వెర్షన్‌ను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు యూట్యూబ్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేశారు. దీంతో మొబైల్ ద్వారా రికార్డ్ చేసిన దాదాపు 4 గంటల నిడివి గల ఈ వీడియోను అప్పటికే వేలాది మంది నెటిజన్లు వీక్షించారు. అయితే ఈ పైరసీ అప్‌లోడ్‌ను గమనించిన అభిమానులు వెంటనే సోషల్ మీడియా వేదికగా దర్శకుడు ఆదిత్య ధర్‌ను ట్యాగ్ చేస్తూ అలర్ట్ చేశారు. ఇక అభిమానుల నుంచి వచ్చిన సమాచారంతో చిత్రబృందం తక్షణమే రంగంలోకి దిగి, యూట్యూబ్ యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా.. ఆ పైరేటెడ్ లింక్‌ను విజయవంతంగా డిలీట్ చేసింది యూట్యూబ్. మరోవైపు ఈ పైరసీ అడ్డంకులు వలన సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం జోరు తగ్గలేదు. కేవలం రెండు వారాల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1400 కోట్ల మైలురాయికి చేరువలో ఉంది. ఇప్పటికే నార్త్ అమెరికాలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచి 'బాహుబలి 2' రికార్డులను సైతం అధిగమించింది. రణవీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, ఆర్ మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం నటించిన ఈ చిత్రం ప్రస్తుతం రికార్డుల వేటను కొనసాగిస్తోంది.

# రామాయణ టీజర్‌కు భారీ హైప్..




దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం రామాయణపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పౌరాణిక ఇతిహాసాన్ని ఆధునిక టెక్నాలజీతో ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించాలన్న లక్ష్యంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై సినీ అభిమానుల్లో ఆసక్తి తారాస్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో సినిమా నుంచి ఫస్ట్ టీజర్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 2న టీజర్‌ను రిలీజ్ చేయనున్నట్లు సమాచారం. టీజర్ విడుదలకు ముందే అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాకు హైప్ క్రియేట్ చేయాలన్న ఉద్దేశంతో మేకర్స్ ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ టీజర్ సుమారు 2 నిమిషాల 38 సెకన్ల నిడివితో ఉండబోతోందని టాక్.

ఇందులో ప్రధాన పాత్రలైన రాముడు, సీతతో పాటు రావణుడు, హనుమంతుడు పాత్రలను పరిచయం చేయనున్నారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తుండగా, రావణుడి పాత్రలో యష్, హనుమంతుడిగా సన్నీ డియోల్ కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని గ్లోబల్ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారు. అందుకే హిందీతో పాటు ఇంగ్లీష్‌లో కూడా టీజర్ విడుదల చేయనున్నారు. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ హాలీవుడ్ స్థాయిలో ఉండబోతున్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. సినిమాకు సంగీతాన్ని ఏఆర్ రెహమాన్ మరియు హాన్స్ జిమ్మెర్ కలిసి అందిస్తున్నారు. ఈ అరుదైన కాంబినేషన్ సినిమా స్థాయిని మరింత పెంచనుందని భావిస్తున్నారు. ఈ మహత్తర ప్రాజెక్ట్‌ను రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొదటి భాగాన్ని 2026 దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. రామాయణ టీజర్ విడుదలకు ముందే భారీ హైప్ సృష్టించడంతో, ఈ చిత్రం భారతీయ సినిమాను మరోసారి ప్రపంచ స్థాయికి తీసుకెళ్తుందా అనే ఆసక్తి నెలకొంది. టీజర్ విడుదల తర్వాత ఈ అంచనాలు మరింత పెరగడం ఖాయం.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154